Email : telanganaveenaoffcial@gmail.com
Title Code : 12280
# తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..




http://Epepar.telanganaveena.com | ఆదివారం జూన్ 8 2025 | సంపుటి:2 | సంచి 254 | హైదరాబాద్ | పేజీలు:8 | రూ.3/-

- రాజ్‌భవన్‌లో ఏర్పాట్లకు ఆదేశాలు
- ముగ్గురు లేదా నలుగురు ప్రమాణం
- ఏయే వర్గాలకు ఛాన్స్ దక్కేది సస్పెన్స్

# కేబినేట్ విస్తరణకు కాంగ్రెస్ గ్రీన్ సిగ్నల్





## నేడు మంత్రివర్గ ప్రమాణస్వీకారం

**తెలంగాణవీణ, హైదరాబాద్,**
తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై కొనసాగుతున్న ఊహాగానాలకు తెరపడింది. ఎట్టకేలకు మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆదివారం తెలంగాణ కేబినెట్ విస్తరణ జరుగనుందని సమాచారం. మంత్రివర్గంలో కొత్తగా ముగ్గురికి చోటు- దక్కనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఇప్పటి వరకు 12 మంది కేబినెట్‌లో మంత్రులుగా ఉన్నారు. మరో ఆరు స్థానాలను భర్తీ చేయాల్సి ఉంది. అయితే ఏడాదిన్నరకు పైగా కేబినెట్ విస్తరణ జరగలేదు. దీంతో కాంగ్రెస్ పార్టీలో ఆశావాహుల సంఖ్య పెరిగింది. తమకు అవకాశం ఇవ్వాలంటూ అధిష్టానం చుట్టూ నేతలు తిరుగుతున్న పరిస్థితి. ఇటీవల మీనాక్షీ నటరాజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్‌గా నియమితులైన తర్వాత ఆశావాహులంతా కూడా ఆమె -మిగతా 2 లో

## తెలంగాణ రైతాంగానికి కేసీఆర్ శ్రీరామరక్ష



- రైతు ప్రయోజనాలు కాపాడేది బీఆర్ఎస్ మాత్రమే
- కాంగ్రెస్, బీజేపీ లు గోదావరి,కృష్ణ దోపిడీలపై మాట్లాడరు
- కాళేశ్వరంపై కావాలనే పదేపదే అబద్దాల ప్రచారం
- మాజీమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**తెలంగాణవీణ, హైదరాబాద్**
గోదావరి, కృష్ణా జలాల విషయంలో రాష్ట్ర రైతాంగానికి, రైతాంగ ప్రయోజనాలకు ఎప్పటికైనా కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న నిందలు, దందాలు, చందాలు.. ఇదే కాంగ్రెస్ పాలన అని విమర్శించారు. నీళ్ల విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, బీజేపీ దుష్ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లలో ఒక దగ్గర పగుళ్లు వస్తే దాన్ని పట్టుకొని దున్నపోతు ఈనిందని కాంగ్రెస్ వాళ్లు అంటే.. -మిగతా 2 లో



## మహారాష్ట్ర ఎన్నికల్లో రిగ్గింగ్

- రాహుల్ ఆరోపణలపై ఈసీ తీవ్ర స్పందన
- ఇది నిరాధార ఆరోపణలని వెల్లడి

**తెలంగాణవీణ, న్యూఢిల్లీ**
మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై ఎన్నికల కమిషన్ తీవ్రంగా స్పందించింది. రాహుల్ వాదనలు నిరాధారమని, చట్ట నియమాలకు అవమానమని ఎన్నికల కమిషన్ పేర్కొంది. ఎన్నికల కమిషన్ 2024 డిసెంబర్ 24న కాంగ్రెస్‌కు పంపిన సమాధానంలో ఈ వాస్తవాలన్నింటినీ ఎన్నికల కమిషన్ తన వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఇలాంటి అంశాలను మళ్లీ -మిగతా 2 లో



## బనకచర్లపై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు

- ఏపీ ప్రభుత్వం కేంద్రానికి డీపీఆర్ ఇచ్చింది
- సీఎం రేవంత్ కూడా జలవనరుల శాఖను కలవాలి
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

**తెలంగాణవీణ, హైదరాబాద్**
బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. బనకచర్ల మీద కేంద్రం నిర్ణయం తీసుకోలేదని తేల్చి చెప్పారు. గోదావరి జలాల పంపిణీ మేరకు తెలంగాణకు అన్యాయం జరగవద్దని, ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని కోరుతున్నాను.. ఎందుకు బనకచర్ల ప్రాజెక్టును నిలిపి వేయాలనే దానిపై పూర్తి వివరాలతో -మిగతా 2 లో



## కాళేశ్వరం విచారణకు హాజరవుతా

- కమిషన్ ముందు వాస్తవాలు ఉంచుతా
- కాళేశ్వరంపై ఎవ్వరికీ భయపడేది లేదు
- కాళేశ్వరం ద్వారా లక్ష ఎకరాలకు పైగా నీరందించిన ఘనత మాది
- నీళ్లు ఇవ్వలేదని కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోంది
- విచారణకు వెళ్లడం ద్వారా నిజాలు నిరూపిస్తా
- మాజీమంత్రి హరీష్ రావు వెల్లడి

**తెలంగాణవీణ, హైదరాబాద్,.**
: కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరవుతానని కాళేశ్వరం కమిషన్ విచారణపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం కమిషన్‌కు తాము భయపడుతున్నామని సీఎం రేవంత్ రెడ్డికి ఎవరు చెప్పారని ప్రశ్నించారు. కాళేశ్వరం కమిషన్ ముందు వాస్తవాలను ఉంచుతామని చెప్పారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని పటాపంచలు చేస్తామని తెలిపారు. బీజేపీకి ఎన్‌డీఎస్‌ఏ జేబు సంస్థలా మారిందని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్రానికి కల్పతరువని బీఆర్ఎస్ ఎమ్మెల్యే -మిగతా 2 లో




## వచ్చే ఐదురోజులు వానలేవానలు

- వాతావరణ శాఖ చల్లటి కబురు


**తెలంగాణవీణ, హైదరాబాద్,.**
రాష్ట్ర ప్రజలకు వాతావరణశాఖ శుభవార్త చెప్పింది. నైరుతి రుతుపవనాల ఆగమనంతో వర్షాలు కురిశాయి. ప్రస్తుతం వర్షాలు ముఖం చాటేయడంతో.. మళ్లీ ఎండలు దంచికొడు తున్నాయి. భానుడు ప్రతాపం చూపుతుండడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. అయితే, ద్రోణి ప్రభావంతో తెలంగాణలో రాగల ఐదురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు -మిగతా 2 లో

## దేశంలో కరోనా వైరస్ కలకలం

- 24 గంటల్లో 391 కొత్త కేసులు..
- నాలుగు మరణాలు



**తెలంగాణవీణ, న్యూఢిల్లీ**
దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. గత 24 గంటల్లో 391 కొత్త కేసులు నమోదయ్యాయి. దీంతో దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 5,755కు పెరిగింది. అదే సమయంలో నిన్న ఒక్కరోజే నాలుగు మరణాలు కూడా నమోదయ్యాయి.కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం.. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి శనివారం ఉదయం 8 గంటల వరకూ 391 మందికి పాజిటివ్‌గా తేలింది. ప్రస్తుతం దేశంలో 5755 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. ఇక ఇప్పటి వరకూ 5,484 మంది డిశ్చార్జ్ అయ్యారు. అత్యధికంగా కేరళలో 1806 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఆ తర్వాత గుజరాత్‌లో 717, ఢిల్లీలో 665, పశ్చిమ బెంగాల్‌లో 622, మహారాష్ట్రలో 577, కర్ణాటకలో 444 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. ఇక తెలుగు రాష్ట్రాలైన ఏపీలో నిన్న ఒక్కరోజే 10 కేసులు -మిగతా 2 లో



## బీజాపూర్ మరో భారీ ఎన్‌కౌంటర్

- ఐదుగురు మావోయిస్టులు మృతి

**తెలంగాణవీణ, ఛత్తీస్‌గఢ్**
ఛత్తీస్‌గఢ్ అడవుల్లో గత కొన్ని రోజులుగా తుపాకుల మోత మోగుతోంది. ఆపరేషన్ కగార్‌లో భాగంగా యాంటీ నక్సల్ ఆపరేషన్ చేపట్టిన భద్రతా దళాలు.. కంటికి కనిపించిన మావోయిస్టులను కాల్చుకుంటూ పోతున్నాయి. -మిగతా 2 లో

# మహారాష్ట్ర ఎన్నికల్లో రిగ్గింగ్

(మొదటి పేజి తరువాయి)

మళ్లీ లేవనెత్తడం ద్వారా ఈ వాస్తవాలన్నింటినీ పూర్తిగా విస్మరించినట్లు కనిపిస్తోంది. ఎవరైనా ఏదైనా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తే అది చట్టంపై అగౌరవానికి సంకేతం మాత్రమే కాకుండా, వారి సొంత రాజకీయ పార్టీ నియమించిన వేలాది మంది ప్రతినిధుల ప్రతిష్టను కూడా దెబ్బతీస్తుందని ఎన్నికల కమిషన్ పేర్కొంది. ఇది ఎన్నికల సమయంలో అవిశ్రాంతంగా, పారదర్శకంగా పనిచేసే లక్షలాది మంది ఎన్నికల సిబ్బందిని నిరాశ పరుస్తుంది. ఓటర్ల నుంచి ఏదైనా ప్రతికూల నిర్ణయం తర్వాత ఇలా చెప్పడం ద్వారా ఎన్నికల కమిషన్‌ను అపఖ్యాతి పాలు చేయడానికి ప్రయత్నించడం పూర్తిగా అసంబద్ధం అని పేర్కొంది. గత ఏడాది నవంబర్‌లో జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని రాహుల్ ఆరోపించారు. ఇదే తరహాలో త్వరలో బిహార్‌లో జరుగనున్న ఎన్నికల్లోనూ రిగ్గింగ్ జరుగుతుందని ఆరోపించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ట్వీట్ చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల రిగ్గింగ్‌పై రాహుల్ రాసిన కథనాన్ని ఓ పత్రికలో పోస్టు చేశారు. ఆ పత్రిక రిపోర్టును ఆయన తన ఎక్స్‌లో షేర్ చేశారు. రిగ్గింగ్ ప్రజాస్వామ్యానికి 2024 మహారాష్ట్ర ఎన్నికలు బ్లూప్రింట్ అని, ఆ రిగ్గింగ్ ఎలా జరిగిందో ఈ ఆర్టికల్‌లో తెలుస్తుందన్నారు. ఐదు దశల్లో రిగ్గింగ్ జరుగుతుందని రాహుల్ పేర్కొన్నారు. తొలి దశలో ఎన్నికల సంఘంలో రిగ్గింగ్ పక్రియ ప్రారంభమవుతుందని.. ఎలక్టోరల్ రోల్‌కు నకిలీ ఓటర్లను జోడిస్తారని ఆరోపించారు. ఆ తర్వాత బోగస్ ఓట్ల ఆధారంగా బీజేపీ గెలుస్తుందని, ఆధారాలను దాచిపెడుతారని విమర్శించారు. రిగ్గింగ్‌ను మ్యాచ్ ఫిక్సింగ్‌తో పోల్చారు. చీటింగ్ చేసిన పార్టీ గెలుస్తుందని, కానీ దాని వల్ల వ్యవస్థలన్నీ నష్టపోతాయన్నారు. ప్రజల్లో విశ్వాసం నాశనం అవుతుందన్నారు. మహారాష్ట్రలో జరిగిన మ్యాచ్ ఫిక్సింగ్ .. త్వరలో బీహార్ ఎన్నికల్లో జరుగబోతోందన్నారు.

# బనకచర్లపై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు

(మొదటి పేజి తరువాయి)

జల వనరుల శాఖను కలవాలని కోరారు. బనకచర్ల ప్రాజెక్టు వలన తెలంగాణకి ఏ విధంగా నష్టం జరుగుతోందో డీటెయిల్డ్ గా లేఖ రాయాలని తెలంగాణ ప్రభుత్వానికి సూచనలు చేశారు. అయితే, గత వారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రానికి డీపీఆర్ ఇచ్చిందని అన్నారు. కేంద్రం ఇంకా ఆ రిపోర్ట్ పరిశీలించలేదు.. బనకచర్ల ప్రాజెక్ట్ రిపోర్ట్ చదవలేదు.. అధ్యయనం చేసిన తరువాత నిర్ణయం తీసుకుంటుంది.. కేంద్ర ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు ఎలిజిబిలిటీ-వచ్చింది అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. త్వరలో అధ్యక్షుడి ఎన్నిక ఉంటుంది.. నేను మరోసారి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండను.. సేవ్ తెలంగాణ నినాదంతో బీజేపీ ముందుకు వెళ్తుంది.. తెలంగాణలో అధికారమే లక్ష్యంగా ముందుకెళ్తాం అన్నారు. బీజేపీ నేతగా ఈటల రాజేందర్ ను కాళేశ్వరం కమిషన్ ముందుకు వెళ్లలేదు.. గత ఆర్థిక మంత్రిగా ఈటల విచారణకు వెళ్లారు.. బీజేపీ స్టాండ్ చెప్పాలని కమిషన్ అడగలేదు.. ఆర్థిక మంత్రిగా ఏం జరిగిందో ఈటల కమిషన్ ముందు వివరించారు.. ఇక, తుమ్మల నాగేశ్వర్ రావు ఆల్ పార్టీ మంత్రి.. బీఆర్ఎస్, టీడీపీ, కాంగ్రెస్ పార్టీలలో మంత్రిగా పని చేశారని కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. దేశంలో గత 11 ఏళ్లుగా సుపరిపాలన సాగుతోందని, అందుకే యావత్ ప్రపంచం భారత్ వైపు చూస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ చేపట్టిన కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా వివరించాలని, వ్యతిరేక ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని భాజపా శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణకు కేంద్రం అన్ని రంగాల్లో నిధులిచ్చిందని తెలిపారు. ఉగ్రవాదుల చేతుల్లో వందలమంది చనిపోతే గతంలో కాంగ్రెస్ స్పందించలేదు. ఉగ్రవాదులు పర్యాటకులను చంపితే 'ఆపరేషన్ సిందూర్' పేరుతో దాడులు చేశాం. తెలంగాణ రాష్ట్రాన్ని రక్షించే పార్టీ భాజపా. కాంగ్రెస్, భారాసలు ప్రజలకిచ్చిన హామీలను మరిచిపోయాయని కిషన్ రెడ్డి విమర్శించారు.

# వచ్చే ఐదురోజులు వానలేవానలు

(మొదటి పేజి తరువాయి)

కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. ఉరుములు, మెరుపులు, గంటకు 30-40 కిలోమీటర్ల ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దక్షిణ మధ్య మహారాష్ట్ర నుంచి ఉత్తర ఇంటీ-రియర్ కర్నాటక, తెలంగాణ మీదుగా కోస్తా ఆంధ్ర వరకు సగటు-సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ఉపరితల ద్రోణి బలపడిందని పేర్కొంది. ఉత్తర ఇంటీరియర్ కర్నాటక, పరిసర ప్రాంతాల్లో సగుట సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తుల ఉన్న ఉపరితల ఆవర్తనం బలహీనపడిందని తెలిపింది. శనివారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, సూర్యాపేట, నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రాబోయే ఐదు రోజుల్లో తెలంగాణలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఆదివారం నాడు ఆదిలాబాద్, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్ సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూలు, వనపర్తి నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది. అన్ని జిల్లాల్లో 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. సోమవారం నాడు ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ, గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మంగళవారం నాడు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది. బుధవారం నాడు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉందని వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఐఎండీ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

# కేబినేట్ విస్తరణకు కాంగ్రెస్ గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజి తరువాయి)

కలిసి మంత్రి పదవి కోసం వినతులు చేశారు. కొత్తగా ఎన్నికైన నేతలు, సీనియర్ నేతలు తమకు అవకాశం కల్పించాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డితో పాటు-, ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ పెద్దలను కలుస్తున్నారు. ఈ క్రమంలో మంత్రి వర్గ విస్తరణపై కాంగ్రెస్ హైకమాండ్ సంకేతాలు ఇచ్చింది. ఈ క్రమంలో నేడు మంత్రి వర్గ విస్తరణ ఉండే అవకాశాలు కన్పిస్తున్నాయి. దీనిపై రాజ్‌భవన్ నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. మంత్రివర్గ విస్తరణకు సంబంధించి ఏర్పాట్లు- చేయాల్సిందిగా రాజ్‌భవన్ వర్గాలను సీఎం కోరినట్లు తెలుస్తోంది. కేబినెట్ విస్తరణలో ముగ్గురికి చోటు- దక్కే అవకాశం ఉందని,అయితే ఈ ముగ్గురు ఎవరనే దానిపై ఉత్కంఠ నెలకొంది. మంత్రి వర్గంలో చోటు దక్కించుకునేందుకు అనేక మంది పోటీపడుతున్నారు. ఎస్సీ సామాజిక వర్గం నేతలు, రెడ్డి సామాజిక వర్గం నేతలు మంత్రి వర్గంలో స్థానం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు- తెలుస్తోంది. ఇప్పటి వరకు ఎస్సీ సామాజికవర్గానికి కేబినెట్‌లో ప్రాధాన్యత లేదు. ముదిరాజ్‌లకు కచ్చితంగా అవకాశం ఇస్తానని



గత ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అంతేకాకుండా మైనార్టీలకు కూడా కేబినెట్‌లో చోటు లభించలేదు. ఈ క్రమంలో రేపటి కేబినెట్ విస్తరణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలకు చోటు లభించే ఛాన్స్ ఉన్నట్లు- తెలుస్తోంది. ఓసీ సామాజిక వర్గానికి లేకుండా బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన వారికి మాత్రమే ఇచ్చే అవకాశం ఉందని కూడా ప్రచారం జరుగుతోంది. మాజీమంత్రి సుదర్శన్‌రెడ్డికి మంత్రివర్గంలో కచ్చితంగా చోటు ఇవ్వాల్సిందేనని కొందరు నేతలు పట్టుబడుతున్నట్టు సమాచారం. ఇప్పటికే కసరత్తు చేసిన పేర్లను పార్టీ అధిష్ఠానానికి నివేదించినట్టు- తెలుస్తోంది. ఈరోజు రాత్రికి లేదా రేపు ఉదయానికి మంత్రివర్గంలోకి తీసుకునేవారి పేర్లపై స్పష్టత వచ్చే అవకాశముంది. ఆదివారం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహణకు గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మకు సమాచారం ఇచ్చినట్లు- తెలుస్తోంది. రేపు నాలుగైదు ముహూర్తాలు ఖరారు చేసినట్లు- సమాచారం. అయితే కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి పేర్లు నిర్ధరణ అయ్యాక.. ఏ ముహూర్తంలో ప్రమాణస్వీకారం ఉంటుందో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. పార్టీ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌తో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే పలు దఫాలుగా చర్చించారు.

# తెలంగాణ రైతాంగానికి కేసీఆర్ శ్రీరామరక్ష

(మొదటి పేజి తరువాయి)

దాన్ని పట్టుకొని దుడ్డెని కట్టేయమని బీజేపీ వాళ్లు అంటున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తెలంగాణ భవన్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'తెలంగాణ ఉద్యమానికి శీర్షిక నీళ్లు, నిధులు, నియామకాలు. అందుకే పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వం ఈ మూడు రంగాల్లో సంపూర్ణమైన న్యాయం చేసింది. నీళ్ల విషయంలో కృష్ణా, గోదావరిలో ప్రతినీటి బొట్టు-ను ఒడిసిపట్టి చుక్క నీటిని వదలకుండా కాళేశ్వరం లాంటి ప్రాజెక్టును కాలంతో పోటీపడి కట్టినా, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని దాదాపు 90 శాతం పూర్తిచేసినా, సీతారామ ప్రాజెక్టును కూడా 90 శాతం పూర్తిచేసి తెలంగాణ రైతాంగం ప్రయోజనం కోసం కేసీఆర్ సర్కారం నిరంతరం పనిచేసింది. కానీ నేడు నీళ్లు, నిధులు, నియామకాలు అనే శీర్షిక ఎక్కడో పోయింది. ఇవాళ రాష్ట్రంలో జరుగుతున్న నిందలు, దందాలు, చందాలు. బీఆర్ఎస్ మీద నిందలు, బిల్డర్లు కాంట్రాక్టర్లతో దందాలు, రాహుల్ గాంధీకి చందాలు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పని ఇది. నిస్సిగ్గుగా రాష్ట్ర ముఖ్యమంత్రి గానీ, బీజేపీ నీళ్ల విషయంలో చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడానికి హరీశ్‌రావు వివరంగా సమాచారం అందిస్తారు. గుజరాత్‌లో మార్బీ అనే ప్రాంతంలో ఒక పెద్ద బ్రిడ్జి కూలి పోయి 140 మంది చనిపోయినా ఏ ఎన్‌డీఎస్‌ఏ పోదు, ఏజెన్సీ పోదు. ఆ 140 మంది చావులకు ఫలానావాడు బాధ్యుడని ఏ ఏజెన్సీ గానీ, కేంద్ర ప్రభుత్వం గానీ మాట్లాడదు. బీహార్‌లో నాలుగు రోజులకి ఒక బ్రిడ్జి కూలిపోతున్నా అడిగే నాథుడు లేడు. అదే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా సుంకిశాల రి-టైనింగ్ వాల్ కూలిపోయి రూ.100 కోట్లు- నష్టం జరిగితే ఎన్‌డీఎస్‌ఏ రాదు, ఎవడు రాడు. అలానే అవినీతి, కమీషన్ల కక్కుర్తితో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలిపోయి 8 మంది చనిపోయినా.. ప్రమాదం జరిగి 100 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఉత్తమ్ కుమార్ రెడ్డి, రేవంత్ రెడ్డి, కేంద్రంలో ఉండే ఒక్క మంత్రి ఒక్క మాట కూడా మాట్లాడరు. ఎవరూ బాధ్యత తీసుకునేవారు లేరు. అలాగే వట్టెం పంప్ హౌస్ మునిగిపోతే దాని గురించి మాట్లాడే వాళ్ళు లేరు, పెద్ద వాగు ప్రాజెక్ట్ రెండు సార్లు కొట్టుకు పోయినా అడిగేవాడు లేడు. కానీ కాళేశ్వరంలో 100 కాంపోనెంట్లు ఉంటే ఒక్క మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లలో ఒక దగ్గర పగుళ్లు వస్తే దాన్ని పట్టు-కొని దున్నపోతు ఈనిందని కాంగ్రెస్ వాడు అంటే దాన్ని పట్టు-కొని దుడ్డెని కట్టేయమని బీజేపీ వాళ్లు రెండు రోజుల్లో ఎన్‌డీఎస్‌ఏ రిపోర్టును వారి పార్టీ ఆఫీసులో తయారు చేశారు ప్రజలను భ్రమింపచేసే ప్రయత్నం చేశారు. దానికి తిరుగులేని విధంగా ఎల్ అండ్ టీ-సంస్థ ఎన్‌డీఎస్‌ఏ నివేదికను తిరస్కరిస్తున్నామని స్పష్టం చెప్పింది. అది చెత్తబుట్టలో పడేయడానికి తప్ప ఎందుకు పనికిరాదని చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీని కట్టిన సంస్థ పనికిరానిదైతే కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని అదే సంస్థతో ఎందుకు కట్టించావని రేవంత్ రెడ్డిని అడుగుతున్నా. కాంగ్రెస్ కార్యాలయాన్ని కూడా తెలంగాణ నుంచి పోయిన మూటలతో కట్టారని అందరికీ తెలుసు. వాస్తవాలు తెలియజెప్పడానికి, కాంగ్రెస్, బీజేపీలు కుమ్మక్కైక నీళ్లిచ్చిన కేసీఆర్ మీద, నీళ్లిచ్చి కన్నీళ్లు తుడిచిన కేసీఆర్ ప్రభుత్వంపైన అభాండాలు వేసే ప్రయత్నం చేస్తున్నారు. కమిషన్ పేరుతో నాటకాలు ఆడుతున్న విషయంలో వాస్తవాలను బట్టబయలు చేయడానికే హరీశ్ రావును తానే కోరాను. ఈ పరంపరలో ఇది మొదటి మీటింగ్. డాలస్, లండన్‌లో చాలామంది ఎన్‌ఆర్ఐలు తమకు కూడా వివరాలు చెప్పాలని, మేము కూడా సోషల్ మీడియాలో చెప్తామన్నారు. ఈ విషయంలో ఒకడేమో బట్టకాల్చి మీదేస్తుంటే.. మరొకడేమో తానా అంటే తందానా అంటు-న్నడు. కాంగ్రెస్, బీజేపీ ఇద్దరు కలిసి తెలంగాణ బొండిగ పిసికే ప్రయత్నం చేస్తున్నరు. తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్ చేసిన పనిని కావాలని అపవాదులు వచ్చేవిధంగా అనుమానాలు కలిగేలా ప్రచారం చేస్తున్నరు, వాస్తవాలు చెప్పాలని కోరారు. జిల్లాల్లో కూడా ఇలాంటి మీటింగ్‌లు ఏర్పాటు- చేస్తాం. ఇది మొదటి ప్రయత్నం కాదు. ఇప్పటికే మేడిగడ్డం పోయాం. దానిని వెంటనే రిపేర్ చేయాలని, నీళ్లిచ్చే అవకాశం ఉన్నా ఇవ్వడం లేదని ఎన్‌డీఎస్‌ఏ యాక్ట్ కూడా చూపెట్టాం. ఓనరే రిపేర్ చేయాలని అందులో ఉంది. ప్రభుత్వం దానిని ఇప్పటికీ పట్టించుకోవడం లేదు. రైతుల పొలాలను ఎండబెడుతున్నది. ఈ విషయంలో ప్రభుత్వం తన వైఖరిని చెప్పాలి. గోదావరి జలాల విషయంలో ఏపీ అనుమతుల్లేకుండా కడుతున్న ప్రాజెక్టు మీద ముఖ్యమంత్రి మాట్లాడడు, బీజేపీ కేంద్ర మంత్రులు మాట్లాడరు, కాంగ్రెస్ బీజేపీ వాళ్లు నోరు తెరవరు. అందుకే గోదావరి, కృష్ణా జలాల విషయంలో రాష్ట్ర రైతాంగానికి, రైతాంగ ప్రయోజనాలకు ఏనాటికైనా కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్షని కేటీఆర్ అన్నారు.

# దేశంలో కరోనా వైరస్ కలకలం

(మొదటి పేజి తరువాయి)

వెలుగు చూడగా.. తెలంగాణలో నాలుగు కేసులు బయటపడ్డాయి. ప్రస్తుతం ఏపీలో 72, తెలంగాణలో 9 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఇక నిన్న మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడులో ఒక్కొక్కరు చొప్పున మొత్తం నలుగురు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఈ ఏడాది ఇప్పటి వరకూ కొవిడ్‌తో మరణించిన వారి సంఖ్య 59కి పెరిగింది

## బీజాపూర్ మరో భారీ

# ఎన్‌కౌంటర్

(మొదటి పేజి తరువాయి)



ఇప్పటికే పలువురు అగ్రనేతలు ఎదురు కాల్పుల్లో మృతి చెందిన విషయం తెలిసిందే. తాజాగా శనివారం కూడా ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. బీజాపూర్ జిల్లాలోని నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు మరణించారు. ఘటనాస్థలిలో రెండు ఏకే 47 రైఫిళ్లు, భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నాలుగు రోజులుగా అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మరణించారు. బీజాపూర్ జిల్లాలోని నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం మేరకు జిల్లా రిజర్వ్ గార్డ్స్(డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్‌ఫోర్స్(ఎస్‌టీఎఫ్) భద్రతా దళాలు గత నాలుగు రోజులుగా సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురు, శుక్రవారాల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో సుధాకర్, భాస్కర్ మరణించారు. భాస్కర్‌పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షలు, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూ.25 లక్షల రివార్డు ప్రకటించగా, సుధాకర్‌పై రూ.40 లక్ష రివార్డు ఉన్నది.

# కాళేశ్వరం విచారణకు హాజరవుతా

(మొదటి పేజి తరువాయి)

హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మొత్తం 20 లక్షల 33 వేల 572 ఎకరాలకు సాగునీరు అందిస్తే, ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేదని కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఒక ఏడాది కరువు వస్తే, ఎస్సారెస్పీకి కూడా నీళ్లను రివర్స్ పంపింగ్ చేశామన్నారు. తెలంగాణ భవన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుపై హరీశ్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మిడ్ మానేర్ నుంచి ఎల్ఎండీకి నీళ్లు తెచ్చి, అక్కడి నుంచి ఎస్సారెస్పీ స్టేజ్ 1కు నీళ్లిచ్చామన్నారు. ఎస్సారెస్పీ స్టేజ్ 2లో తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ దాకా నీరు అందించామని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం నీళ్లు పంపించి పంటలు కాపాడిందని తెలిపారు. ఇది వాస్తవమైన రిపోర్టు అని, నీటి పారుదలశాఖ అధికారులిస్తున్న నివేదిక అని వెల్లడించారు. కానీ కాంగ్రెస్ నాయకులు 50 వేల ఎకరాలే పారిందని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఏర్పడక ముందు గోదావరి జలాల సద్వినియోగానికి ఎవరూ కృషి చేయలేదు. 2007 నుంచి 2014 వరకు కేంద్రంలో, మహారాష్ట్రలో, ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వాలే ఉన్నప్పటికీ తుమ్మడి హట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం కోసం కేంద్రం నుంచి ఏ అనుమతి సాధించలేదు. బీఆర్ఎస్ పార్టీలో ఆలోచన చేసినం, తెలంగాణ పచ్చబడాలంటే గోదావరి జలాలే కావాలనుకున్నం. గోదావరి నది 1465 కిలోమీటర్లు ప్రవహిస్తుంటే, అందులో 750 కిలోమీటర్లు తెలంగాణలోనే ప్రవహిస్తున్నది. ఉమ్మడి ఏపీ రాష్ట్రంలో 1480 టీ-ఎంసీల కేటాయింపులుంటే, తెలంగాణ వాటా 969 టీఎంసీలు. కానీ, వాస్తవంగా అందులో తెలంగాణ వాడకం ఏనాడూ 400 టీ-ఎంసీలు మించలేదు. 2014 వరకు తెలంగాణలో గోదావరిపై కట్టిన ప్రాజెక్టులు ఎస్సారెస్పీ, దేవాదుల మాత్రమే. తెలంగాణ ఉద్యమం ఉప్పెనలా వస్తే, తలొగ్గిన కాంగ్రెస్ ప్రభుత్వం.. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. అక్కడ నీటి లభ్యత ఉండదు. ప్రాణహిత-చేవెళ్ల నీటి నిల్వ సామర్థ్యం కేవలం 11 టీ-ఎంసీలు మాత్రమే. కాళేశ్వరం ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 141 టీ-ఎంసీలు.. రెండింటి మధ్య ఎంత తేడా.. 2014 వరకు కాంగ్రెస్ నాయకులు సర్వే, మొబిలైజేషన్ అడ్వాన్సుల కింద రూ.2328 కోట్లు- కాంట్రాక్టర్లకు ఇస్తే, పనులు జరగనేలేదు. ఇందులో మట్టి కూడా ఎత్తకుండా మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరిట రూ.1052 కోట్లు- కాంగ్రెస్ ప్రభుత్వం స్వాహా చేసిందని స్వయంగా కాగ్ తన రిపోర్టులో వెల్లడించింది. ఇట్లా ఆ పైసలు కాంగ్రెస్ నాయకులు తీసుకొని జేబులు నింపుకున్నరు. అప్పుడు మంత్రులుగా ఉన్నది కూడా ఇదే కోమటిరెడ్డి, ఉత్తమ్, శ్రీధర్ బాబులే. ఆనాడు రేవంత్ రెడ్డి తెలుగుదేశం పార్టీలో ఉండి విమర్శించిండు. జలయజ్ఞం కాదు.. ధనం యజ్ఞం అన్నడు. కానీ ఈరోజు రేవంత్ రెడ్డే కాంగ్రెస్ అవినీతిని వెనకేసుకొస్తున్నడు.

తెలంగాణ వీణ
తెలంగాణ వీణ ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
8328209811



# సింధూ జలాల ఒప్పందం పునరుద్ధరించండి

### భారత్‌కు నాలుగు లేఖలు రాసిన పాకిస్థాన్



**తెలంగాణవీణ, న్యూఢిల్లీ**

పెహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసిన విషయం తెలిసిందే. ఆ ఒప్పందంపై పునరాలోచన చేయాలని పాకిస్థాన్ కోరుతోంది. ఇప్పటికే ఇండియాకు నాలుగు లేఖలు కూడా రాసినట్లు తెలుస్తోంది. సింధూ నదికి చెందిన నీళ్లు ఇండియా అడ్డుకున్న నేపథ్యంలో.. పాకిస్థాన్‌లో నీటి సంక్షోభం మొదలైనట్లు కొన్ని వర్గాల ద్వారా తెలుస్తోంది. ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేస్తూ సింధూర్ ఆపరేషన్ చేపట్టిన తర్వాత కూడా ఇండస్ వాటర్ ట్రీటీపై పాకిస్థాన్ లేఖ రాసినట్లు చెబుతున్నారు. ఉగ్రవాదం, వాణిజ్యం ఒకే విధానంగా ఉండడం కుదరదని ఇండియా తేల్చింది. రక్తం, నీళ్లు కూడా ఒకే చోట ప్రవహించదన్నారు. సిందూ జలాల ఒప్పందాన్ని పరస్పర విశ్వాసం, స్నేహం ఆధారంగా రూపొందించారు. కానీ సీమాంతర ఉగ్రవాదానికి పాల్పడుతున్న పాకిస్థాన్ చర్యలను భారత్ ఖండిస్తోంది. పాకిస్థాన్ నీటి వనరుల శాఖ కార్యదర్శి సయ్యిద్ అలీ ముర్తాజా ఆ లేఖలను .. కేంద్ర జలశక్తి మంత్రిత్వ కార్యాలయానికి పంపినట్లు స్పష్టం అవుతున్నది. ఆ లేఖను మళ్లీ విదేశాంగ కార్యాలయానికి పంపారు. నీటి సంక్షోభాన్ని పరిష్కరించకుంటే ఆకలితో చస్తామని, సింధూ పరివాహక ప్రాంతం తమకు జీవాధారం అని, మూడో వంతు నీళ్లు తమకు దేశం బయటి నుంచి వస్తోందని, సిందూ బేసిన్‌పై 10లో 9 మంది ఆధారపడుతారని, 90 శాతం పంటలు ఆ జలాలపైనే ఆధారపడుతాయని, పవర్ ప్రాజెక్టులు, డ్యామ్‌లు అన్నీ సింధూ నదిపైనే కట్టారని, మాపై వాటర్ బాంబు పడినట్లు ఉందని, దాన్ని త్వరగా డిఫ్యూజ్ చేయాలని ఇటీవల పాకిస్థాన్ సేనేటర్ సయ్యిద్ అలీ జాఫర్ తెలిపారు. సింధూ, జీలం, చీనాబ్, రావి, బియాస్, సట్లజ్ నదులకు చెందిన నీటిని వాడుకునేందుకు 1960లో ఇండస్ వాటర్ ట్రీటీని ఏర్పర్చుకున్నారు.

# ప్రపంచ కుబేరుడి కొత్త పార్టీ పేరు ఇదేనా..?

### ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఎలాన్ మస్క్..



**తెలంగాణవీణ, న్యూఢిల్లీ**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ , స్పేస్ ఎక్స్ అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మధ్య వివాదం రోజురోజుకూ ముదురుతున్నది. నిన్నమొన్నటి వరకు చెట్టాపట్టాలేసుకుని తిరిగిన ఈ ఇద్దరూ ఇప్పుడు ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటున్నారు. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలుపునకు సొంత డబ్బును నీళ్లలా ఖర్చు చేసిన మస్క్ ఇప్పుడు అదే ట్రంప్ వైఖరిని తప్పుబడుతున్నారు. ఇటీవలే డోజ్ శాఖ నుంచి వైదొలిగిన మస్క్.. బహిరంగంగానే ట్రంప్‌పై సంచలన ఆరోపణలు చేస్తున్నారు. ప్రస్తుతం వీరి మధ్య విభేదాలు కొత్త చర్చకు దారి తీశాయి. ట్రంప్‌తో విభేదాల వేళ ఎలాన్ మస్క్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు గురించి మస్క్ ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. మధ్య వయస్కుల్లో 80 శాతం అమెరికన్లకు ప్రాతినిధ్యం వహించేలా కొత్త పార్టీ స్థాపించడానికి ఇది తగిన సమయమేనా..? అంటూ తనకున్న 20 కోట్ల మందికి పైగా ఫాలోవర్లను ప్రశ్నించారు. దీని కోసం పోల్ పెట్టారు. ఆసక్తికరంగా 80శాతం మంది దీనికి అనుకూలంగా ఓటు వేశారు. 400,000 మంది తన ప్రశ్నకు స్పందించారని.. అందులో 83 శాతం మంది మూడో, మధ్య స్థాయి పార్టీకి అనుకూలంగా స్పందించారని మస్క్ తెలిపారు. 'ప్రజలు చెప్పారు. 80శాతం మందికి ప్రాతినిధ్యం వహించేలా కొత్త పార్టీ ఇప్పుడు అవసరమే. దీన్ని 80శాతం మంది అంగీకరించారు' అని మస్క్ వెల్లడించారు. ఆ తర్వాత 'ది అమెరికా పార్టీ' అంటూ మస్క్ మరో పోస్ట్ చేశారు. తన కొత్త పార్టీకి మస్క్ ఇదే పేరు పెట్టబోతున్నారంటూ ప్రస్తుతం చర్చ మొదలైంది. అయితే, దీనిపై మస్క్ నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటనా రాలేదు.

# భారత్‌లో 5.3% పేదరికం తగ్గింది

### ప్రపంచబ్యాంకు




**తెలంగాణవీణ, హైదరాబాద్**

భారత్‌లో పేదల సంఖ్య తగ్గారని తాజాగా ప్రపంచబ్యాంకు నివేదిక వెల్లడించింది. 2011-12లో 27.1 శాతంగా ఉన్న పేదరికం రేటు 2022-23కి 5.3 శాతానికి తగ్గిందని తాజాగా వరల్డ్ బ్యాంకు నివేదిక పేర్కొంది. 2011-12 నాటికి 344.47 మిలియన్ల ప్రజలు పేదరికంలో మగ్గిపోయారని, ఇప్పుడు వారి సంఖ్య 2022-23 నాటికి 75.24 మిలియన్ల ప్రజలే పేదిరికంలో ఉన్నారని వీరి సంఖ్య పదకొండేళ్ల కంటే ఇప్పుడు బాగా తగ్గిందని ఈ నివేదిక పేర్కింది. అంటే దాదాపు 11 సంవత్సరాలలో 269 మిలియన్ల ప్రజలు తీవ్ర పేదరికం నుండి బయటపడ్డారని ఈ నివేదిక స్పష్టం చేసింది. ప్రధానంగా 2011- 12 నాటికి భారత్‌లో అత్యంత పేదవారిలో 65 శాతం మంది ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఉన్నారు. అయితే 2022-23 నాటికి ఈ రాష్ట్రాల్లో పేదరికం మూడింట రెండువంతలకు తగ్గింది. 2021 ధరల ఆధారంగా.. మూడు డాలర్లు (ఇండియన్ కరెన్సీలో 257 రూపాయలు) కంటే తక్కువ తక్కువ ఖర్చు పెడితే అంతర్జాతీయ దారిద్ర్య రేఖ కంటే దిగువ ఉన్నట్టుగా వరల్ బ్యాంకు అంచనా వేసింది. ఈ లెక్కన చూస్తే భారత్‌లో గ్రామీణ, పట్టణ ప్రాంతల్లో రోజుకు మూడు డాలర్ల కంటే తక్కువపెట్టే వారి సంఖ్య గణనీయంగా తగ్గిందని, దీంతో భారత్‌లో పేదరికం తగ్గిందని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. 2017 ధరల ఆధారంగా.. 2.15 డాటర్లను తక్కువ ఖర్చుపెట్టి.. తీవ్ర పేదరికంలో ఉన్న భారతీయులు 2.3 శాతం మంది ఉన్నారు. 2011-12లో అత్యంత పేదిరకంలో ఉన్న వారి శాతం 16.2 శాతం. ఇప్పుడు 2.3 శాతానికి తగ్గిందని ప్రపంచబ్యాంకు తాజా నివేదిక తెలిపింది. తాజా డేటా ప్రకారం రోజుకు 2.5 డాలర్లను కూడా ఖర్చుపెట్టలేనివారు 2011లో 205.93 మిలియన్ల ప్రజలు ఉంటే.. 2022 నాటికి 33.66 మిలియన్ల మందికి తగ్గారు. గడచిన 11 ఏళ్లలో గ్రామీణ తీవ్ర పేదరికం 18.4 శాతం నుండి 2.8 శాతానికి తగ్గింది. పట్టణ తీవ్ర పేదరికం 10.7 నుంచి 1.1 శాతానికి తగ్గింది. బహుమితీయ పేదరికపు సూచిక (ఎంపిఐ) 2005-06లో 53.8 శాతంగా ఉంది. 2019-21 నాటికి 16.4 శాతానికి తగ్గింది. 2022-23లో 15.5 శాతానికి తగ్గిందని ప్రపంచబ్యాంకు తాజా నివేదిక తెలిపింది. పేదరికాన్ని తగ్గించడంలో ప్రధాని మోడీ నాయకత్వం తీవ్రంగా కృషి చేసిందని వరల్డ్ బ్యాంకు పేర్కొంది. పిఎం ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, జన ధన్ యోజన, ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాలతోపాటు, గృహ నిర్మాణం, ఇంధనం, బ్యాంకింగ్, ఆరోగ్య సంరక్షణకు సంబంధించి చర్యలు తీసుకోవడం వల్లే పేదరికం తగ్గిందని వరల్డ్‌బ్యాంకు పేర్కొంది.

# ముకేశ్ అంబానీ మంచి మనసు..

### ముంబై ఐసీటీకి గురుదక్షిణగా రూ.151 కోట్ల విరాళం



**తెలంగాణవీణ, న్యూఢిల్లీ**

రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత, ఆసియాలోనే అత్యంత ధనవంతుడు ముకేశ్ అంబానీ తన మంచి మనసు చాటుకున్నారు. తాను చదువుకున్న ముంబైలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీకి గురుదక్షిణగా భారీ విరాళాన్ని అందించారు. ఐసీటీకి రూ.151 కోట్లు విరాళంగా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఈ మొత్తాన్ని సంస్థ అభివృద్ధికి ఏ విధంగానైనా ఉపయోగించుకోవచ్చని వెల్లడించారు. విఖ్యాత రసాయన శాస్త్రవేత్త, ప్రొఫెసర్ ఎంఎం శర్మ జీవిత చరిత్ర ఆధారంగా రూపుదిద్దుకున్న 'డివైన్ సైంటిస్ట్' పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ముఖేశ్ అంబానీ ఈ కీలక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విరాళం తన గురువు ప్రొఫెసర్ శర్మకు ఇచ్చే గురుదక్షిణ అని పేర్కొన్నారు. తాను చదువుకున్న రోజులను, ప్రొఫెసర్ శర్మతో ఉన్న అనుబంధాన్ని ముకేశ్ అంబానీ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. 1970లో ఐసీటీ నుంచి ముకేశ్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్నారు. గతంలో దీన్ని యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీగా వ్యవహరించేవారు. 2008లో దీనికి ఐసీటీగా పేరు మార్చారు.

# ఖార్కీవ్‌పై రష్యా డ్రోన్ల దాడి



**తెలంగాణవీణ, కీవ్**

ఉక్రెయిన్‌పై భారీ అటాక్ చేసింది రష్యా. రెండో అతిపెద్ద నగరమైన ఖార్కీవ్‌పై విరుచుకుపడింది. సుమారు 50 డ్రోన్లతో అటాక్ చేసింది. ఆ దాడిలో ముగ్గురు మృతిచెందారు. మరో 17 మంది గాయపడ్డారు. డ్రోన్లతో పాటు రెండు మిస్సైళు, నాలుగు గ్లైడింగ్ బాంబులను కూడా ఖార్కీవ్ నగరంపై రష్యా ఫైర్ చేసినట్లు ఉక్రెయిన్ పేర్కొన్నది. కేవలం 90 నిమిషాల వ్యవధిలో ఆ అటాక్ ముగిసినట్లు ఖార్కీవ్ మేయర్ తెలిపారు. దాడిలో అపార్ట్‌మెంట్ బ్లాక్‌లు, ప్రైవేట్ ఇండ్లు ధ్వంసం అయ్యాయి. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ.. ఇటీవల పశ్చిమ దేశాల నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ నేతలు ఉదాసీనంగా ఉండడం వల్లే దాడులు కొనసాగుతున్నట్లు చెప్పారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కూడా పుతిన్‌పై వత్తిడి తేలేకపోతున్నట్లు చెప్పారు. తాజాగా జరిగిన దాడులపై రష్యా ఇప్పటి వరకు అధికారిక ప్రకటన చేయలేదు. ఖేర్సన్ నగరంలో ఓ బిల్డింగ్‌పై జరిగిన దాడిలో ఓ జంట మృతిచెందినట్లు తెలుస్తోంది. వందల సంఖ్యలో డ్రోన్లు, మిస్సైళ్ల దాడి జరిగినట్లు ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆంద్రీ సిబిహ తెలిపారు. ఖార్కీవ్‌లో శుక్రవారం రాత్రి భీకరంగా సాగిందన్నారు. ఉక్రెయిన్ దేశవ్యాప్తంగానూ దాడులు జరిగినట్లు చెప్పారు. డోనస్కీ, డినిప్రో, టెర్నోపిల్, ఒడిసా ప్రాంతాల్లో అటాక్‌లు జరిగాయి. చాలా చోట్ల ప్రజలు గాయపడ్డారు, చనిపోయారని చెప్పారు. ఎనర్జీ మౌళికసదుపాయాలు దెబ్బతిన్నట్లు తెలిపారు.

# వైద్య పరీక్షల కోసం.. సిమ్లా ఆసుపత్రికి సోనియా గాంధీ



**తెలంగాణవీణ, సిమ్లా**

కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ శనివారం స్వల్పంగా అస్వస్థతకు గురయ్యారు. వ్యక్తిగత పర్యటన కోసం హిమాచల్ ప్రదేశ్‌కు వెళ్లిన ఆమెను సిమ్లాలోని ఇందిరా గాంధీ మెడికల్ కాలేజీ (ఐజీఎంసీ) ఆసుపత్రికి తరలించారు. సోనియా గాంధీ ఆరోగ్య పరిస్థితిని ప్రత్యేక వైద్యుల బృందం పర్యవేక్షించింది. చిన్న ఆరోగ్య సమస్యల కారణంగా వైద్య పరీక్షల కోసం ఐజీఎంసీకి ఆమె వచ్చినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. సోనియా ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. వైద్య పరీక్షల తర్వాత ఆసుపత్రి నుంచి తిరిగి వెళ్లినట్లు చెప్పారు. కాగా, ఐజీఎంసీ వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. హిమాచల్ ప్రదేశ్ ఆరోగ్య మంత్రి ధని రామ్ శాండిల్, ప్రధాన కార్యదర్శి ప్రబోధ్ సక్సేనా ఆసుపత్రికి చేరుకున్నారు. రెండు రోజులు ఉనా పర్యటనలో ఉన్న హిమాచల్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు కూడా తన పర్యటన ముగించుకుని సిమ్లాకు తిరిగి వచ్చారు. మరోవైపు హిమాచల్ ప్రదేశ్‌లోని ఛరాబ్రాలో ప్రియాంక గాంధీ వాద్రాకు వ్యక్తిగత నివాసం ఉన్నది. దీంతో సోనియా గాంధీ విశ్రాంతి కోసం ఇక్కడకు వచ్చినట్లు సమాచారం. ఆదివారం తిరిగి ఢిల్లీ చేరుకోవాల్సి ఉంది. అయితే చిన్న ఆరోగ్య సమస్యలకు వైద్య పరీక్షల కోసం సిమ్లాలోని ఇందిరా గాంధీ మెడికల్ కాలేజీ (ఐజీఎంసీ) ఆసుపత్రికి ఆమె వెళ్లినట్లు తెలుస్తున్నది.

# ఈనెల 9న లండన్ వేదికగా యూఎస్-చైనా భేటీ



**తెలంగాణవీణ, హైదరాబాద్**

ట్రేడ్ వార్ లో ఢీ అంటే ఢీ అని పోరాడిన అమెరికా-చైనా దేశాలు చర్చలతో శాంతించిన విషయం తెలిసిందే. ఇరుదేశాలు కూడా ప్రతీకార సుంకాలపై ఏకాభిప్రాయంతో ఆయా దేశాల దిగుమతులపై టారిఫ్‌లను తగ్గించుకున్నాయి. ఈనెల 9న లండన్ వేదికగా యూఎస్- బీజింగ్ మధ్య మరోసారి సుంకాలప ప్రతిపాదనపై కీలక చర్చలు జరగనున్నాయి. తమ దేశం తరఫున ట్రెజరీ మంత్రి స్కాట్ బెసెంట్, వాణిజ్య మంత్రి హెూవార్డ్ లుట్నిక్, వాణిజ్య ప్రతినిధి జేమీసన్ గ్రీర్ పాల్గొంటారని ట్రంప్ వెల్లడించారు. అలాగే ఈ సమావేశం బాగా జరగాలని ఆయన ఆకాక్షించారు. అయితే చైనా తరఫున ఎవరు హాజరుఅవుతారో తెలియాల్సి ఉంది. గురువారం చైనా అధినేత షీ జిన్‌పింగ్‌తో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడిన సంగతి తెలిసిందే. దాదాపు గంటన్నరపాటు సాగిన ఈ సుదీర్ఘ సంభాషణ సానుకూలంగా ముగిసిందని ట్రంప్ ప్రకటించారు. సుంకాలతోపాటు అరుదైన మూలకాల (రేర్ ఎర్త్ మినరల్స్) సరఫరా విషయంలో తలెత్తిన అవరోధాలను తొలగించే దిశగా త్వరలో రెండు దేశాల మధ్య చర్చలు సాగుతాయని వెల్లడించారు. అంతకుముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత నెలలో చైనాపై సుంకాలను 145 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతీకారంగా చైనా కూడా అమెరికా దిగుమతులపై 125 శాతం సుంకాలు విధించింది. ఆ తర్వాత ఇరుదేశాల ఒప్పందంతో ప్రతీకార సుంకాలను తగ్గించుకున్నాయి.

## సంపాదకీయం

# ఎన్‌డిఎ పక్షాలు మోడీ భజన మానాలి !

ఎన్‌డిఎ పక్షంలో ఉన్న ఆయా పార్టీల నేతలు అధికారం కోసం కాకుండా దేశ హితం కోసం పనిచేయాలి. సమస్యలను దేవం ముందు ఉంచాలి. వాటి పరిష్కారానికి ఒత్తిడి తేవాలి. ప్రధానంగా నిరుద్యోగం, ఉపాధి రంగాలు క్షీణంచాయి. గత పదేళ్ల మోడీ అధికారం వేరు. ఇప్పుడు మోడీ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తోంది. అది కూడా ఎన్‌డిఎ పక్షాల మద్దతుతో కొనసాగుతోంది. ఈ క్రమంలో చంద్రబాబు, నితీశ్ కుమార్లాంటి వారు సమర్థత కనబర్చాలి. జలవనరులు మొదలుకుని అనేక సమస్యలపై చర్చించాలి. ప్రజల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని ఎన్‌డిఎ పక్షాలు ఇక దేశం కోసం పనిచేయాల్సి ఉంది.ఏడాది కాలం గడిచింది. ఎన్‌డిఎ పక్షాలప్రభావం ఏమాత్రం లేదన్నది సుస్పష్టంగా కనిపిస్తోంది. కేవలం సొంత రాష్ట్రాల ప్రయోజనాలు కాకుండా దేశం కోసం ఆలోచన చేయాల్సిన బాధ్యత ఎన్‌డి పక్షాలపై ఉంది. కేవలం మోడీని పొగడ్తలతో ముంచెత్తకుండా ముందుకు సాగాలి. మోడీ పదేళ్ల కాలం పాలన ఒక ఎత్తు..ఈ ఐదేళ్ల కాలం మరో ఎత్తు అన్న విషయం గుర్తించి ముందుకు సాగాల్సి ఉంది. ఇందులో ఏడాది గడిచింది. ఇక మిఇలింది నాలుగేళ్ల కాలమే. ఇప్పుడే ఎన్‌డిఎ పక్షాలకు అధికారం వచ్చింది. ఉమ్మడిగా పాలించే అవకాశం చిక్కింది. ఈ క్రమంలో వీరంతా దేశం కోసం కఠిన పరిశ్రమ చేయాలి. దేశం ఎన్నో సమస్యలను, సవాళ్లను ఎదుర్కొంటోంది. అవేమీ పరిష్కరించ లేని సమస్యలు కాదు..అవన్నీ కూడా పరిష్కార యోగ్యంగా ఉన్నవే. కాకపోతే చిత్తశుద్ది పెట్టి పనిచేయాల్సి ఉంది. ప్రధానంగా ఎన్‌డిఎ పక్షాలు ముందుగా దేశం ముందున్న సమస్యలపై చర్చ చేయాలి. తమతమ రాష్ట్రాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల ఆకాంక్షలను తెలుసు కోవాలి. వాటిని ఎన్‌డిఎ వేదికపై పెట్టి చర్చించాలి. ముందుగా ప్రజలు తమంతగా తాము ధైర్యంగా బతకగలిగే పరిస్థతులను తీసుకుని రావాలి. ఇందుకు సంకల్పం కూడా కావాలి. ఎన్నికల్లో గెలిచాం..మరో ఐదేళ్ల తరవాత గెలవడం ఎలా అన్న తరహాలో పథకాలతో పోటీపడుతూ పోతే ప్రజలు మరో పార్టీని ఆదరిస్తారని గుర్తించాలి.దేశీయంగా విమానయాన రంగం పూర్తిగా దెబ్బతింది. అనేక నగరాలకు నేరుగా వెళ్లేలా విమాన సర్వీసులను గుర్తించాలి. ప్రజలకు అందుబాటు ధరల్లో విమాన సౌకర్యం కలిగించేలా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఇక ప్రధానంగా ఉచిత పథకాలకు, తాయిలాలకు స్వస్తి పలకాలి. ప్రజలను బిచ్చగాళ్లుగా చేసే పథకాల రచనను మానాలి. ప్రజలు స్వయం శక్తితో బతికేలా చేయాలి. వండివార్చి పెడతామన్న రీతిలో డబ్బుల పందేరం చేసే పద్దతులను మానుకోవాలి. ప్రధానంగా విద్య,వైద్యరంగాలను బలోపేతం చేయాలి. ప్రతి ఒక్కరు సర్కార్ స్కూళ్ల వైపు చూసేలా చేయాలి. కార్పోరేట్ దోపిడీని అడ్డుకోవాలి. వైద్యరంగంలో కూడా విప్లవాత్మక మార్పులు తీసుకుని రావాలి. ప్రభుత్వ ఆస్పత్రులు కార్పోరేట్ ఆస్పత్రులను తలదన్నేలా పటిష్టం చేయాలి. ఇందుకు ఎంతైనా ఖర్చు చేయాలి. అలాగే ధరలను అదుపు చేసేందుకు కసతరత్తు చేయాలి. నిరుద్యోగ సమస్యను ప్రధాన అంశంగా తీసుకుని ముందుకు సాగాలి. అదేపనిగా ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే కుట్రలను అడ్డుకోవాలి. విశాఖస్టీల్ కావచ్చు..ఎల్‌ఐసి లాంటి సంస్థలను బలోపేతం చేస్తే కొంతయినా నిరుద్యోగ సమస్య తీరుతుందని గుర్తించాలి. కొత్తగా సంస్థలను తీసుకుని రావాలి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రాధాన్యం ఇవ్వాలి. అవంతేగాకుండా సమస్యలు ఏవైనా పార్లమెంటులో చర్చ జరిగేలా చూడాలి. గత పదేళ్లలో ఏ అంశంలోనూ సమగ్ర చర్చ జరగలేదు. విపక్షాలను పురుగులకన్నా హీనంగా చూశారు. మాట్లాడితే సభనుంచి బయటకు పంపారు. ఈ తరహా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం నుంచి బయటపడాలి. బీజేపీలో ఆత్మవిమర్శ వస్తుందని..ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటారని..ప్రజలకు మేలు జరుగుతుందని అంతా భావించేలా చేయాలి. బిజెపి అంటే ఇక్కడ మోడీ అని మాత్రమే గుర్తించాలి. మంచి చేసి ప్రజల మనసులు గెల్చుకోవడం ద్వారా ఎన్నికల్లో గెలవాలన్న భావన లేదా ఆలోచన స్థిరపడాలి. ధరలు తగ్గించడం, ముఖ్యంగా గ్యాస్, పెట్రో ధరలు తగ్గించడం, నిత్యావసరాల ధరలు తగ్గించడం, జిఎస్టీ భారాలపై కోతలు పెట్టడం, బ్యాంకుల వడ్డీ రేట్లు తగ్గించడం, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన చేయడం వంటి విషయాల్లో ఆలోచన చేయడం వంటివి బిజెపి నేతల ఎజెండాలో ప్రధానం కావాలి. ఎన్‌డిఎ నేతల ఎజెండాలో ఇవి చేరాలి. వీటికోసం చంద్రబాబు,నితీశ్ తదితరులు పట్టుబట్టాలి. కేవలం బిజెపిని 240 సీట్లకే పరిమితం చేయడం ద్వారా ఎన్‌డిఎ నేతలకు పగ్గాలు అప్పగించారు. ఇప్పటికయినా బిజెపి అగ్రనాయకులుగా ఉన్న మోడీ, అమిత్ షా లు ఈ పరిణామాలను గుర్తించాలి. అన్ని పార్టీలకన్నా తాము భిన్నమని చెప్పుకుంటున్న బిజెపి ప్రజల కోణంలో పాలన చేయడం మొదలు పెట్టాలి. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చ చేయాలి. ప్రజలకు నమ్మకం కలిగించాలి. ఇలాంటి సమయంలో బీజేపీ అగ్ర నాయకత్వం స్పీడ్ పెంచాలి. బీజేపీ ఆశించిన స్థాయిలో పరిస్థితులు కనిపించడం లేదన్నది నూటికినూరు శాతం నిజం. ఈ క్రమంలో బిజెపి తన ఎజెండాను మార్చుకోవాలి. ముందుగా ప్రజల ఆశాలు, ఆకాంక్షలను అర్థం చేసుకోవాలి. అందుకు తగిన ప్రణాళికతో ముందుకు సాగాలి. ఇకపోతే దేశంలో రాజకీయాల తీరు మారాలి. ఇంతకాలం దూకుడు ప్రదర్శించిన బిజెపి ఇప్పుడు దేశం కోసం దూకుడు ప్రదర్శించాలి. ఉమ్మడి పౌరస్మృతి రావాల్సిందే. విపక్షాలను తిట్టిపోస్తూ..అసలు సమస్యలను పక్కదారి పట్టించే రాజకీయాలను మానుకోవాలి.

# నేటి నుంచి బడిబాట కార్యక్రమం

-విద్యార్థుల నమోదు పెంపుదలే లక్ష్యం.
-ముందుగానే పాఠశాలలకు చేరిన పుస్తకాలు, ఏకరూప దుస్తులు.
-సుగురు వరప్రసాదరావు మద్దిగట్ల.జి.హెచ్.ఎం



**తెలంగాణవీణ, వనపర్తి.**
పెద్దమందడి మండలంలోని, మద్దిగట్ల -మోజర్ల జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్లో బడి-బాట కార్యక్రమంలో భాగంగా శనివారం ఇంటింటి బడి ఈడు పిల్లల పర్యవేక్షణకు శ్రీకారం చుట్టారు పాఠశాల బృందం. ఈ సందర్భంగా ఎస్.వరప్రసాద్ రావు మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలలో, ప్రవేశాలను పెంపొందించేందుకు ప్రతి సంవత్సరం రాసే విద్యాశాఖ బడి-బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని హెచ్‌ఎం అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గి పోతుండడంతో వీటిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర విద్యాశాఖ ప్రభుత్వ విద్యను గాడిలో పెట్టి, పిల్లల పెంపుదలే లక్ష్యంగా తగు కార్యాచరణను రూపొందించింది. బడి -బాట కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలో ఉన్న వసతులు, ఉచితంగా అందించే అంశాలు, బోధన తీరును, విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తున్నామని అన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో జూన్ 6 నుంచి 19వరాజు బడిబాట కార్యక్రమం నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ, తెలంగాణలోని ఉపాధ్యాయులకు బడిబాటను విజయవంతం చేయాలని ఆదేశించింది. పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈ.వీ. నరసింహ బడిబాట కార్యక్రమం షెడ్యూల్ తో పాటు మార్గదర్శాలు కూడా జారీ చేశారు. విద్యా సంవత్సరం పున: ప్రారంభం కావునా జూన్ 12న పాఠశాలలను ప్రారంభానీకి ముందు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయం చేస్తూ సమావేశాలు నిర్వహిస్తున్నామని అన్నారు. గతానికి కంటే భిన్నంగా ఈ ఏడాది పాఠశాలలకు ముందుగానే పాఠ్య పుస్తకాలతో పాటు,ఏకరూప దుస్తులను పంపిణీ చేస్తున్నామని అన్నారు. బడులు తెరిచిన తొలి రోజున పిల్లలకు అన్ని అందించేందుకు గాను ఉపాధ్యాయులు ఇప్పటికే పుస్తకాలను, దుస్తులను,బడికి పంపించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఎస్. వరప్రసాదరావు, ఉపాధ్యాయులు పి.వెంకటస్వామి,అశ్విని భగవంతు,పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు

# బోడుప్పల్ లో ఘనంగా బక్రీద్ వేడుకలు



**తెలంగాణవీణ, మేడిపల్లి ప్రతినిధి**
త్యాగానికి,విశ్వాసానికి, మానవతా విలువలకు,మత, సామాజిక ఐక్యతను పెంపొందించే బక్రీద్ పండుగను మేడ్చల్ మాల్కాజ్గిరి జిల్లా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు.నగరంలోని ప్రఖ్యాత కుతుబ్ షాహీ ఆలంగీర్ మస్జీద్ నందు ముస్లింలు ప్రత్యేక ఈద్ అల్ అధా ప్రార్థనలునిర్వహించారు.ఖుర్బానీ అంటే బలిదానం ఇవ్వడం,త్యాగం అనే అర్థాలున్నాయని ముస్లీం పెద్దలు తెలిపారు.ఖుర్బానీ ఇవ్వడానికి హజరత్ ఇబ్రహీం అనే ప్రవక్త త్యాగమే కారణమని చెప్పారు బక్రీద్ రోజున మాంసాన్ని మూడు భాగాలుగా చేసి ఒక భాగం పేదలకు,రెండో భాగం బంధువులకు,మరో భాగం తన కుటుంబం కోసం వినియోగించడం ఆనవాయితీ అని అన్నారు ఈ కార్యక్రమంలో మొహమ్మద్ తాజుద్దీన్,మహబూబ్ అలీ, ఖాదర్,హమీద్,పాషా,షఫీ, ఉరూజ్,ఫిరోజ్,అబ్బాస్, నిజాం,జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్న ముస్లిం సోదరులు

-జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఎంజి.సోహెల్ భాయ్



**తెలంగాణవీణ,వనపర్తి జిల్లా ప్రతినిధి**
ఈద్ ఉల్ ఆదా(బక్రీద్) పర్వదినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముస్లిం సోదరులకు ముస్లిం సోదరులు,ముస్లిం సమాజానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు ఎంజి. సోహెల్ బాయ్.ఈ సందర్భంగా బక్రీద్ పండుగ ఈద్గా దగ్గర మీడియాతో ఎంజి. సోహెల్ బాయ్ మాట్లాడుతూ త్యాగానికి,సహనానికి,భక్తి విశ్వాసాలకు,బక్రీద్ పండుగ ప్రతీకగా నిలుస్తుంది అని అన్నారు. శాంతి,కర్ణ,సహనం, సామరస్యం ఐకమత్యం, సోదర భావం స్ఫూర్తితో ఈ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీక అని,ఈ పర్వదినాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ముస్లిం సమాజం ఘనంగా జరుపుకుంటుందని,ఈ మాసంలో పవిత్ర హజ్ యాత్ర కొనసాగుతుందని పేర్కొన్నారు మహ్మద్ ప్రవక్త బోధనలు మానవాళికి నాడు,నేడు,ఏనాడైనా ఆచరణీయం, అనుసరణీయం అని ప్రేమ, శాంతి,సహనం,దయ,కరుణ, సత్యం గురించి ఉద్భోదించారని చెప్పారు.ఈ కార్యక్రమంలో సతీష్ చీర్ల చందర్, ఎంజి.నబీల్, ఎండి.అజీమ్,డాక్టర్. యంఏ.లతీఫ్,వెంకట్ నారాయణ, వెంకటేష్, కె.సంఘకార తదితరులు పాల్గొన్నారు.

# వలిగొండలో విజయ డైరీ పార్లర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే కుంభం.




**తెలంగాణవీణ, వలిగొండ (ప్రతినిధి)**
మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో నూతనంగా ఏర్పాటుచేసిన విజయ డైరీ పార్లర్ ను విజయ డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డితో కలిసి భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి శనివారం ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయ డైరీ సేవలు పాల ఉత్పత్తి ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలని అన్నారు ప్రజలందరూ విజయ డైరీని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ డిప్యూటీ డైరెక్టర్ జి ప్రదీప్ మేనేజర్ మహేష్ ప్రొపరేటర్లు మల్లారెడ్డి కుషాల్ రెడ్డి రైతులు తుమ్మల ఆగిరెడ్డి తుమ్మల మల్లారెడ్డి లింగారెడ్డి విజయ డైరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# సులోచన దశదినకర్మలో పాల్గొన్న మండల నాయకులు




**తెలంగాణవీణ, వలిగొండ (ప్రతినిధి)**
మండల పరిధిలోని వెలువర్తి గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ బొడ్డు సులోచన దశదినకర్మలో వివిధ పార్టీల మండల నాయకులు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా పలువురు మండల నాయకులు ఆమె చేసిన సేవలను కొనియాడారు ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల మండల నాయకులు గ్రామాల నాయకులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు

# త్యాగానికి ప్రతీక బక్రీద్ :మాజీ ఎంపిటిసి సాల్వేరు అశోక్



**తెలంగాణవీణ, రామన్నపేట ప్రతినిధి**
బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని రామన్నపేట మండల వ్యాప్తంగా శనివారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు మండల కేంద్రంలోని ఈద్గా వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు ఈద్గా వద్ద మాజీ ఎంపీటీసీ సాల్వేరు అశోక్ ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ త్యాగానికి సహనానికి భక్తి విశ్వాసాలకు బక్రీద్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో ఈద్గా చైర్మన్ వహీద్,ఎంఏ మజీద్,ఎండి జమీరుద్దీన్,ఎండి అక్రమ్,మన్సూర్ అలీ,హబీబ్,ఎం డి తఖీయొద్దీన్,ఎంఏ మాలిక్,హాఫీస్,తాహేర్,రహీం, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడులు నిలబడాలి చదువుల్లో అంతరాలు పోవాలి

**-పౌరస్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షులు & మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి**




**తెలంగాణ వీణ/ చేగుంట...**
ప్రభుత్వ బడులు నిలబడాలి- చదువుల్లో అంతరాలు పోవాలి అని తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షులు & మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఈరోజు ఉదయం తెలంగాణ పౌర స్పందన వేదిక ప్రచార జాతా రెండో విడత మెదక్ చేగుంట, వారికి తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్)మెదక్ జిల్లా కమిటీ స్వాగతం పలికింది. ఈ సందర్భంగా నర్సిరెడ్డి చేగుంట పట్టణంలోని బస్టాండ్ వద్ద ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.అంతరాలు లేని చదువులకై అందరం మాట్లాడాలని పిలుపునిచ్చారు.తెలంగాణ చదువుల్లో మార్పు రావాలి. ఉన్నోడి పిల్లలైనా, లేనోడి పిల్లలైనా ఒకే బడిలో, ఒకే కళాశాలలో, ఒకే యునివర్సిటీలో చదువుకోవాలనే లక్ష్యంతో తెలంగాణ పౌర స్పందన వేదిక పనిచేస్తుందనీ అన్నారు.నేడు తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ బడులు,కళాశాలలు, యునివర్సిటీలు బడుగుల పిల్లల కొరకే అన్న చందంగా మారింది. చదువును ఎంత పెట్టి కొనగలిగే వారికి, అంత ఫీజుతో ప్రైవేటు రంగములో బడులు,కళాశాలలు,యునివర్సిటీలు వచ్చాయి. ఎంత డబ్బు ఫీజుగా చెల్లించగలిగితే అంత గొప్ప చదువులు లభిస్తాయనే ప్రైవేటు విద్యా సంస్థల ప్రచారము, తల్లిండ్రులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. అధికాదాయ వర్గాలకు ఈ విధానము తమ ఆర్థిక హెరీదాను (దర్జాను) చూపించుకోవడానికి బాగా ఉపకరిస్తుంది. మధ్యతరగతి తల్లిదండ్రులకు ప్రాణసంకటంగా మారి, ప్రభుత్వ విద్యా సంస్థల్లో తమ పిల్లల్ని చేర్చలేక, ప్రైవేటు ఫీజులతో అప్పులపాలవుతున్నారు. దిగువ తరగతి తల్లిదండ్రులు ప్రైవేటు దిక్కు చూడలేక, 77 ఏండ్ల స్వతంత్ర భారతములో మా బ్రతుకులు ఇంతేనని ప్రభుత్వబడులలో,కళాశాలల్లో యునివర్సిటీలలో తమ పిల్లలను చేర్పిస్తున్నారు.భారత రాజ్యాంగము అమల్లోకి వచ్చి 75 ఏండ్లు దాటింది. "భారత ప్రజలమైన మేము ఈ రాజ్యాంగము ద్వారా పాలన చేసుకొని భారత సమాజములో గల ఆర్థిక, సామాజిక అంతరాలను క్రమంగా తగ్గించుకుంటామని 1950 జనవరి 26న అనుకున్నాము." ఆచరణలో చూస్తే సమాజంలో ఆర్థిక, సామాజిక అంతరాలు తగ్గకపోగా, ఈ అంతరాలను సుస్థిరం చేయడానికి తోడ్పడే విధంగా చదువుల్లోనే అంతరాలు సృష్టించగలిగిన ఘనత స్వాతంత్ర్య భారతంలో సాధించగలిగాము. ఎందుకిలా జరిగింది? చదువులపట్ల ప్రజలకున్న నిర్లిప్తత. ప్రజాసమూహాలను చైతన్యపరిచే నోరున్నవారు తమ పిల్లలను ఏదో రకంగా ప్రైవేటులో చదివించుకోవటం, ప్రభుత్వ బడి,కళాశాల, యునివర్సిటి బాగు కొరకు మాట్లాడకపోవటం, కార్యాచరణ చేయకపోవటం వల్లనే ఈ స్థితికి చేరింది.2023 డిసెంబర్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వము ఏర్పడిన తర్వాత, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారే విద్యాశాఖను నిర్వహిస్తున్నారు. రిటైర్డ్ ఐఎఎస్ అధికారి శ్రీ ఆకునూరి మురళి గారు చైర్మన్ గా, ఇంకనూ ముగ్గురు సభ్యులతో "తెలంగాణ విద్యా కమిషన్" నియమించారు. ఈ కమిషన్ ఫిబ్రవరి 2025లో పాఠశాల విద్యలో తీసుకురావలసిన మార్పుల గురించి 21 పేజీల రిపోర్టును రాష్ట్ర ప్రభుత్వానికి అందించారు.తెలంగాణ విద్యా కమిషన్ రిపోర్టు వెలుగులో ఈ క్రింది చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

1. బడి ఈడు పిల్లల సంఖ్య ఆధారంగా గ్రామీణ ప్రాంతంలో పాఠశాలల్ని " రీ-ఆర్గనైజ్" చేయాలి. ఇతర ఆవాసాల నుండి బడికి రావలసిన విద్యార్థుల కొరకు ఉచిత బస్ సౌకర్యం కల్పించాలి.
2. గ్రేటర్ హైదరాబాదు, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ మెదక్ వంటి నగరాలలో మరియు ఖమ్మం, మహబూబ్నగర్, నల్లగొండ వంటి పట్టణాలలో ప్రభుత్వం కొత్త బడులు ఏర్పాటు చేయాలి.
3. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులు ఏర్పాటు చేయాలి. తరగతికొక గది, తరగతికొక ఉపాధ్యాయుడు మరియు ప్రధానోపాధ్యాయులు ఉండే విధంగా ఏర్పాటు చేయాలి.
4. కేంద్ర ప్రభుత్వము కేంద్ర బడ్జెట్లో విద్యకు 10% కేటాయించాలి. తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతుల ఏర్పాటుకు కేంద్రం 5000 కోట్లు ప్రత్యేక గ్రాంటు ఇవ్వాలి.
5. ధార్మిక సంస్థలు ఏర్పాటు చేసిన ఎయిడెడ్ పాఠశాలల్ని ప్రభుత్వము స్వాధీనము చేసుకొని, ప్రభుత్వ పాఠశాలలుగా నిర్వహించాలి.
6. క్రమంగా అంతరాలు లేని బదులను అభివృద్ధి చేసి, ఉన్నోడి పిల్లలైనా, లేనోడి పిల్లలైనా ఒకే బడిలో, ఒకే తరగతి గదిలో చదువుకునే పరిస్థితులు కల్పించాలి.

అంతరాలు లేని చదువులకై అందరూ మాట్లాడాలని, కార్యాచరణలోకి రావాలని విజ్ఞప్తి చేస్తున్నామనీ అన్నారు. ఈ కార్యక్రమంలో టి పి ఎస్ వి ఉపాధ్యక్షులు మంగ, దణమూర్తి,టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి లక్ష్మారెడ్డి , టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పద్మారావు, ఉపాధ్యక్షులు కవిత,భీమ్లా నాయక్,సుధాకర్,కనకరాజు, యేసయ్య, భూషణం,శ్రీనివాస్, డాక్య, వాసురం, కేవీఆర్ నాయుడు, యాదయ్య, నర్సింలు, గణేష్, ప్రభాకర్, ప్రేమాకుమార్,తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో కౌకూర్ భరత్ నగర్ లో బస్తీ దావాఖాన...

**-పేదల ఆరోగ్యానికి ఆసరాగా బస్తీ దావాఖాన ......**
**-మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి నేతృత్వంలో ఏర్పాటు...**





**తెలంగాణవీణ,అల్వాల్....**
మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు నాయకత్వంలో కౌకూర్ భారత్ నగర్లో సరికొత్త బస్తీ దావాఖానా ఏర్పాట్లు చకచకా జరుగుతున్నారు. ఇక్కడి ప్రజలకు వైద్యసేవలందించేందుకు బస్తీ దావాఖాన సిద్ధమైతుంది. దీంతో పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు ఎంతో దోహదపడనుంది. నిరుపేద, అణగారిన వర్గాల ప్రజల వైద్య అవసరాలను తీర్చడానికి, వారికి వైద్య సహాయం అందించడానికి సిద్ధమైతోంది. స్థానిక ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, ఈ దావాఖానాను ఏర్పాటు చేయడానికి రూ. 26 వేల నిధులతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు స్థానిక సామాజిక కార్యకర్త తుడిమెళ్ళ మల్లికార్జున్ స్వచ్ఛందంగా వెచ్చించారు. ఈ దావాఖానాకు సులువుగా చేరుకోవడానికి వీలుగా, ఎలాంటి అడ్డంకులు లేకుండా ప్రజలు సందర్శించేందుకు వీలుగా ఆ ప్రాంతాన్నిజేసీబీతో చదును చేశారు. ఇక్కడ బస్తీ దావాఖానా ఏర్పాటుతో, భారత్ నగర్, కౌకూర్ ప్రాంతంలోని నిరుపేద కుటుంబాలకు వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. మైనంపల్లి హనుమంతరావు దార్శనికత, ప్రజల పట్ల ఆయనకున్న అంకితభావం ఈ ప్రాజెక్టు విజయానికి కీలకమని స్థానికులు ప్రశంసిస్తున్నారు.

# ఘనంగా మామిడి సోమయ్య జన్మదిన వేడుకలు

**-శుభాకాంక్షలు తెలిపిన పలువురు జర్నలిస్టులు**



**తెలంగాణవీణ,హైదరాబాద్...**
తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు, గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు, ఏవీఎన్ టీవీ న్యూస్ ఛానల్ సీఈఓ, మహానది పత్రిక ఎడిటర్ మామిడి సోమయ్య జన్మదిన వేడుకలు శనివారం వనస్థలిపురంలోని ఏవీఎన్ టీవీ, మహానది పత్రిక కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో పలువురు ఏవీఎన్ టీవీ సిబ్బంది, మహానది పత్రిక రిపోర్టర్లు పాల్గొని మామిడి సోమయ్య కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్, కోశాధికారి ఆర్. వెంకటేశ్వర్లు, కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్, ఫెడరేషన్ నేషనల్ కౌన్సిల్ మెంబర్ యర్రమిల్లి రామారావు, సీనీయర్ జర్నలిస్టు జెనుగుర్తి ఉదయ్ భాస్కర్ రెడ్డి, ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా నాయకులు గోవింద రావు తదితరులు మామిడి సోమయ్యకు బొకే శాలువాలతో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బంధుమిత్రులు, స్నేహితులతో కలిసి ఆయన కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.


# ఏఎస్ రావు నగర్‌లో కళా సిల్క్ మేళా





**చేనేత కళాఖండాల సంబరం..**

**(తెలంగాణవీణ-కాప్రా)...**
చేనేత వస్త్ర ప్రియులను, కళాభిమానులను విశేషంగా ఆకట్టుకుంటుంది కళాసిల్క్స్ వస్త్ర ప్రదర్శన. కాప్రా సర్కిల్, ఏఎస్ రావు నగర్ మైదానంలో దేశంలోని నలుమూలల నుంచి వచ్చిన 62 మంది హస్తకళాకారులు తమ అద్భుత సృష్టిని ఇక్కడ ప్రదర్శనకు ఉంచారు. ఈ మేళాలో కేవలం వస్త్రాలు మాత్రమే కాదు, అనేక రకాల హస్తకళా వస్తువులు కూడా వినియోగదారులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక ప్రతిమలు, ఆకర్షణీయమైన ముత్యాల దండలు, మగువల మనసు దోచే కళాత్మకమైన ఆభరణాలు, గృహాలను అందంగా అలంకరించు కునేందుకు వివిధ రకాల గృహోపకరణాలు, లెదర్, జూట్ బ్యాగ్‌లు, వివిధ రకాల ఆయుర్వేద ఔషధాలు,



స్వచ్ఛమైన సాండిల్ అగర్‌బత్తులు వంటి ఎన్నో రకాల వస్తువులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. కళా సిల్క్స్ మేళా నిర్వాహకులు వికాస్ జైన్ మాట్లాడుతూ, చేనేత వస్త్ర ప్రియులకు నాణ్యమైన చేనేత వస్త్రాలు, హ్యాండీక్రాఫ్ట్ వస్తువులను నేరుగా ఉత్పత్తి ధరలకే అందించాలనే సంకల్పంతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో ఉండే ఈ మేళాలో దేశంలోని పేరెన్నిక గల ప్రాంతాల నుండి నేరుగా చేనేత కార్మికులు తయారు చేసిన మన్నిక గల వస్త్రాలను అందిస్తున్నామని ఆయన వివరించారు.



వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి , భాగల్పూర్, డిజైనరీ శారీస్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ , లినెన్ , కలంకారీ శారీస్, బెంగాల్ కాటన్ శారీస్ తో పాటు లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనరీ బ్లౌజెస్ లక్నో చికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్ వన్రామ్ గోల్డ్ జ్యువెల్లరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు ఇక్కడి ప్రదర్శనలో వినియోగదారులను విశేషంగా అకట్టుకుంటున్నాయి.

# టీపీసీసీ చీఫ్‌ను కలిసిన పరమేశ్వర్‌రెడ్డి



**తెలంగాణ వీణ,ఉప్పల్...**
రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి శనివారం కలిశారు. పరమేశ్వర్‌రెడ్డితో పాటు మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌ఛార్జీ వజ్రేష్ యాదవ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్స రెడ్డి బూపతి రెడ్డి, మహేష్‌కుమార్‌ను వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పలు విషయాలను చర్చించారు.

## దివంగత బిజెపి రాష్ట్ర నాయకుడు అంపాల పద్మా రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన గవర్నర్ ఇంద్రసేనారెడ్డి






**తెలంగాణ వీణ/నాచారం:**
నాచారంలో త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేన రెడ్డి దివంగత బీజేపీ నాయకుడు కె.శే అంపాలా పద్మ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు పద్మ రెడ్డి పార్టీ విజయం కోసం అవిశ్రాంతంగా కృషి చేశారని, అప్పటి నుంచి తమకు పరిచయం ఉందని తెలిపారు. వారి మరణం బాధాకరమని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు మల్లారెడ్డి, వై. సత్యనారాయణ రావు, రవి నాయక్, మర్రి మోహన్ రెడ్డి, బాల చందర్, డివిజన్ అధ్యక్షులు కొమ్మగల్ల నవీన్ కుమార్, రాగిరి మోహన్ రెడ్డి, మల్కా ప్రకాష్, రవికాంత్, ఉదయ్, కిరణ్, వెంకటేష్ గౌడ్, ఆనంద్, రవీందర్ రెడ్డి, బాలు, దయ గౌడ్, కృష్ణ, శేఖర్, వెంకటేష్, మంజు, జ్యోతి, లావణ్య, చింటూ తదితరులు పాల్గొన్నారు.


## పేదింటి వివాహానికి ఆర్థిక సాయం అందజేసిన చేగుంట మాజీ ఎంపీపీ



**తెలంగాణ వీణ/ చేగుంట...**
మెదక్ జిల్లా, చేగుంట మండల కేంద్రానికి చెందిన పేదింటి వివాహానికి చేగుంట మాజీ ఎంపిపి మాసుల శ్రీనివాస్ మండల కేంద్రానికి చెందిన ఆయిల్ల పోచమ్మ కూతురు శ్రావణి వివాహానికి తన వంతు సాయంగా 5,000/- రూపాయలు ఆర్థిక సాయం అందజేసినారు. ఈ కార్యక్రమంలో పుల్లబోయిన ముత్యాలు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ,సిసి రోడ్ల సమస్యలు పరిష్కరిస్తా

**కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్**



**తెలంగాణవీణ,కాప్రా**
కాప్రా శ్రీ శ్రీనివాస ఆఫీసర్స్ కాలనీలో డ్రైనేజీ, అంతర్గత సిసి రోడ్ల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి తెలిపారు. కాలనీలోని సమస్యలను తెలుసుకునేందుకు శనివారం శ్రీ శ్రీనివాస ఆఫీసర్స్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, కార్యదర్శి సుభాష్ రెడ్డి తో కలిసి ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ, అస్తవ్యస్తంగా ఉన్న సిసి రోడ్ల సమస్యలతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వీధి దీపాల నిర్వహణ అధ్వాన్నంగా మారిందని కార్పొరేటర్ స్వర్ణరాజ్ దృష్టికి తేవడంతో ఆయన జిహెచ్ఎంసి అధికారులతో సమీక్షించి ఈ సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. కాలనీలో డ్రైనేజీ లీకేజీ కాకుండా జలమండలి అధికారులు చర్యలు చేపడతారని తెలిపారు. రాబోయే వర్షాకాలం ని దృష్టిలో ఉంచుకుని కాలనీలో ఎలాంటి సమస్య తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఠాగూర్, చంద్రమౌరీశ్వరరావు,శంకర్రావు ,ఇంద్రారెడ్డి ,రాజు గౌడ్ పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ ఎల్ పి జి దినోత్సవ వేడుకలు...

**-ఇండేన్ ఆయిల్ సికింద్రాబాద్ డివిజన్ కార్యాలయంలో వేడుకలు...**




**తెలంగాణవీణ,సికింద్రాబాద్...**
ప్రపంచ ఎల్పీజీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఇండియన్ ఆయిల్ తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యాలయంలో ప్రపంచ ఎల్పీజీ దినోత్సవాన్నిఘనంగా నిర్వహించారు. శుభ్రమైన ఇంధనం, ఆరోగ్యకరమైన జీవనం, ఆకుపచ్చ భవిష్యత్తు వైపు ముందడుగు" అనే నినాదంతో నిర్వహించారు. కార్యక్రమానికి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, స్టేట్ హెడ్ పీయూష్ మిత్తల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇండేన్ బ్రాండ్ కేవలం వంట ఇంధనం మాత్రమే కాదని, అది ఆత్మవిశ్వాసానికి, అభివృద్ధికి, స్థిరతకు ప్రతీకగా నిలుస్తోందని ఉద్ఘాటించారు. ఇండేన్ తన విస్తృత డిస్ట్రిబ్యూటర్ నెట్‌వర్క్, నిబద్ధత కలిగిన డెలివరీ బాయ్స్, డిజిటల్ బుకింగ్ సౌకర్యాల ద్వారా నిత్యం 1.8 లక్షల రీఫిల్ డెలివరీలు నిర్వహిస్తూ తెలుగు రాష్ట్రాల్లో ప్రతి రెండో ఇంటి వంటగదిని శక్తివంతం చేస్తోందని తెలిపారు. ఇండేన్ బ్రాండ్ కేవలం గృహావసరాలకు మాత్రమే కాకుండా, బేకరీ, గ్లాస్, మెటల్, ఆటోమొబైల్, హెల్త్‌కేర్, లాండ్రీ, ఫోమ్, వ్యవసాయ రంగాల్లో కూడా శుభ్రమైన సమర్థవంతమైన ఇంధన పరిష్కారంగా నిలుస్తోందని మిత్తల్ వివరించారు. ఈ సందర్భంగా ఇండియన్ ఆయిల్ విలువైన ఛానల్ పార్ట్‌నర్స్‌ను సురక్షిత వంటగది ప్రచారానికి చేసిన కృషికి గాను శ్రీ మిత్తల్ ఘనంగా సన్మానించారు. ఇది వినియోగదారుల భద్రత పట్ల ఇండియన్ ఆయిల్ యొక్క నిబద్ధతను తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎల్పీజీ డివిజనల్ సేల్స్ హెడ్ సితేష్ కిషన్ పాల్గొని ఎల్పీజీ భద్రతపై అవగాహన పెంపొందించినందుకు వినూత్న పరికాల వినియోగాన్ని ప్రోత్సహించినందుకు చేసిన కృషిని ప్రశంసించారు. అగ్నిమాపక పరికరాల అవగాహన - విజేతలకు బహుమతులు ఫైర్ బాల్స్ ను ప్రజలకి అవగాహన కల్పించిన 15 మంది విజేతలకు బహుమతులు అందించారు. విజేతలకు హోండా యాక్టివా 5G స్కూటర్లు అందజేశారు. ఈ ఆటోమేటిక్ ఫైర్ ఎక్స్టింగ్విషర్లు చిన్నవిగా ఉండి, సులభంగా ఇన్‌స్టాల్ చేయగలిగేలా రూపొందించబడి ఉంటాయి. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఇవి స్వయంగా క్రియాశీలమై వెంటనే అగ్ని నాశక పొడిని విడుదల చేస్తాయి. కార్యక్రమం ద్వారా ఇండియన్ ఆయిల్ సంస్థ యొక్క శుభ్రమైన ఇంధనం, వినియోగదారుల భద్రత , సుస్థిర అభివృద్ధి పట్ల ఉన్న అంకితభావాన్ని నిరూపించిందన్నారు.

# త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ

**-చేగుంట లో ఘనంగా బక్రీద్ వేడుకలు**


**-ఈద్గాలో సామూహిక ప్రార్థనలు**



**తెలంగాణ వీణ /చేగుంట...**
త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ అని చేగుంట జామ మసీదు ఇమామ్ మౌలానా అన్వార్ అన్నారు. శనివారం బక్రీద్ పండుగ సందర్భంగా పట్టణంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మాట్లాడారు. బక్రీద్ పండుగ ప్రవక్త ఇబ్రహీం,భక్తి భావాన్ని, విశ్వాసాన్ని, త్యాగ భవనాలను, సమాజానికి ప్రబోధిస్తుందన్నారు. ఈ పండుగ రోజున అల్లాకు ఇష్టమైన ఆచారం ఖుర్బానీ, ఇవ్వడం అని అన్నారు. పండుగలోని పరమార్థం జంతువులను బలివడమే కాదని, హృదయంలోని స్వార్థం, అహంకారం,భౌతిక ఆసక్తులను త్యాగం, చేసి అల్లాకు దగ్గరవడమే అన్నారు. స్తోమత ఉన్న ప్రతి ముస్లిం తన సంపాదనలో కొంత త్యాగం చేసి పేదల ఆకలి తీర్చడం మానవత్వాన్ని వెలుగులోకి తేవడమే అన్నారు. సామూహిక ప్రార్థన అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని సోదర భావాలు వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలుపుతున్నారు బక్రీద్ సందర్భంగా పలు రాజకీయ పక్షాల నాయకులు ఈదుగా వద్ద ముస్లిం సోదరులకు స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలిపారు. సామూహిక ప్రార్థనల ఏర్పాట్లను, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చేగుంట ఎస్ ఐ చైతన్య కుమార్ రెడ్డి ఆదేశానుసారం ఎస్ ఐ 2, పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సదర్ షకీల్, రహీమొద్దీన్, జాలిల్, తదితరులు పాల్గొన్నారు

# బిజెపి బాచుపల్లి కార్యవర్గాన్ని ప్రకటించిన అధ్యక్షులు : ప్రసాద్ రాజు

**తెలంగాణ వీణ...**
బిజెపి పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా బాచుపల్లి బిజెపి అధ్యక్షుడు ప్రసాద్ రాజు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు బిజెపి పార్టీ సిద్ధాంతాలకు అంకితమై పార్టీలో అందరితో సమన్వయంతో పనిచేస్తూ పార్టీ కార్యక్రమాలు మరింత ఉత్సాహంగా పాల్గొని పార్టీని మరింత బలోపేతం చేయాలని రాబోవు రోజుల్లో పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ఈ కార్యవర్గం పనిచేయాలని తెలియజేశారు. పార్టీ కొరకు పనిచేస్తున్న వారిని గుర్తించి వారి యొక్క నిబద్ధత,పార్టీ పట్ల శ్రద్ధ, పార్టీకి కేటాయించే సమయము మరియు క్రమశిక్షణ తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని క్రియాశీలకంగా పనిచేసే కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు నూతన కమిటీ సభ్యుల యొక్క బాధ్యతలు ఈరోజు నుండి అమలులోకి వస్తాయని ప్రకటించారు. గతంతో పోలిస్తే భారతీయ జనతా పార్టీ చాలా శక్తివంతంగా తెలంగాణలో ఏర్పడిందని పార్లమెంట్ ఎలక్షన్ల లో తెలంగాణలో 8 మంది ఎంపీలను గెలుచుకున్న పార్టీ బిజెపి అని గుర్తు చేశారు. మల్కాజ్గిరి సిట్టింగ్ స్థానం సైతం బీజేపీ గెలుచుకుందని తెలియజేశారు. అనునిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజల కష్టసుఖాలను పంచుకుంటూ అధికార పార్టీ ఆగడాలను ఎండగడుతూ పార్టీ యొక్క విధి విధానాలను విస్తృతంగా క్షేత్రస్థాయి వరకు తీసుకెళ్తూ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చే విధంగా అందరూ కృషి చేయాలని నూతన కార్యవర్గానికి తెలియజేసి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన కార్యవర్గంలో ప్రకటించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి ప్రధాన కార్యదర్శులుగా గజెల్లి సంతోష్ కుమార్, నారాయణ మూర్తి ఉపాధ్యక్షులుగా గోపతి సురేష్, శివ గణేష్, ఉదయ్ కిరణ్, విజయ్ కుమార్, కార్యదర్శులుగా సునీల్ రెడ్డి,హరిత, విజ్ఞాన్ రెడ్డి,అమర్నాథ్ ట్రెజరర్గా ప్రహ్లాద్లను ప్రకటించారు అదే విధంగా డివిజన్ ఇన్చార్జులుగా 1 వ డివిజన్ భార్గవి రెడ్డి,15 డివిజన్ సాయి కృష్ణారెడ్డి ,16వ డివిజన్ రేపన్ కాసి,17వ డివిజన్ శివప్రసాద్,18వ డివిజన్ కృష్ణారెడ్డి, 19 డివిజన్ కాసాని సంతోష్, 27 డివిజన్ అశోక్ నాయక్,21 డివిజన్ పావని రెడ్డి లను ప్రకటించడం జరిగింది. ఈ నియామకాలు ఈరోజు నుండి అమల్లోకి వస్తున్నట్లుగా తెలియజేశారు.



BHARATIYA JANATA PARTY
Bachupally,Nizampet Municipal Corporation-500090.

Date: 07-06-2025.

N.PRASAD RAJU
President
9676712233

Press Release


Congratulations to all my Bachupally Division Office Bearers

| S.NO | Designation | Names | Contact Number |
|---|---|---|---|
| 1 | Vice President-1 | Gopathi Suresh | 8297194444 |
| 2 | Vice President-2 | K Siva Ganesh | 7997447779 |
| 3 | Vice President-3 | Y Vijay Kumar | 9032328969 |
| 4 | Vice President-4 | K Uday Kiran | 8019636665 |
| 5 | General Secretary-1 | Gajelli Santosh Kumar | 9948599996 |
| 6 | General Secretary-2 | P Narayana Murthy | 8179985335 |
| 7 | Secretary-1 | B.Sunil Reddy | 9701783328 |
| 8 | Secretary-2 | V.Haritha | 9030831513 |
| 9 | Secretary-3 | K.Vignan Reddy | 8971341000 |
| 10 | Secretary-4 | M.Amarnadh | 9000539290 |
| 11 | Treasurer | S.Prahlad | 9502823654 |

Approved By,

Dr.S.Mallareddy
Incharge President
Medcahl-Urban

N.Prasad Raju
President Bachupally



BHARATIYA JANATA PARTY
Bachupally,Nizampet Municipal Corporation-500090.

Date: 07-06-2025.

N.PRASAD RAJU
President
9676712233

Congratulations to all my Bachupally Division Incharges and Morcha Presidents

| S.NO | Designation | Names | Contact Number |
|---|---|---|---|
| 1 | 1st Division Incharge | S.Bhargavi Reddy | 8886279988 |
| 2 | 15th Division Incharge | R.Sai Krishna Reddy | 9177931328 |
| 3 | 16th Division Incharge | Repan Kasi | 9908497474 |
| 4 | 17th Division Incharge | S Siva Prasad | 9618390851 |
| 5 | 18th Division Incharge | S.Krishna Reddy | 9440630135 |
| 6 | 19th Division Incharge | Kasani Santosh | 9515341064 |
| 7 | 20th Division Incharge | M.Ashok Nayak | 7095154410 |
| 8 | 21st Division Incharge | Pavani Reddy | 9618059925 |

Morcha Presidents

| | | | |
|---|---|---|---|
| 1 | BJYM (Yuva Morcha) | M.Bhopal Reddy | 7995121143 |
| 2 | Mahila Morcha | S.Bhargavi Reddy | 8886279988 |
| 3 | OBC Morcha | M.Hanumayya | 9000183840 |
| 4 | SC Morcha | K Sridhar Kumar(Dinesh) | 9177870343 |
| 5 | ST Morcha | | |
| 6 | Minority Morcha | | |

Approved By,

Dr.S.Mallareddy
Incharge President
Medcahl-Urban

N.Prasad Raju
President Bachupally

Office Add:H.No:3-7/3,Shop No-1,Road No-4,Rajivgandhinagar,Bachupally




# బిజినెస్

# వామ్మో తగ్గేదేలే అంటున్న బంగారం ధరలు..

**తెలంగాణవీణ, బిజినెస్**

ట్రంప్? టారీఫ్? ప్రకటనలు, అమెరికా– చైనా మధ్య అనిశ్చితి, ఫెడ్? వడ్డీ రేట్లు, ఆర్బీఐ వడ్డీ రేట్ల కోత వంటి అంశాలు పసిడి ధరల్లో హెచ్చుతగ్గులకు కారణమవుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. అయితే బంగారం ధరలు ఒక రోజు తగ్గితే మరో రోజు పెరుగుతుంటుంది. మన భారతీయ సాంప్రదాయంలో మహిళలు బంగారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుంటారు. అయితే గత రెండు రోజుల కిందట బంగారం ముట్టుకుంటే భగ్గుమంది. ఎందుకంటే బంగారం ధర లక్ష రూపాయలను దాటేసింది. ఐతే వచ్చే రెండు నెలల్లో బంగారం ధరలు తగ్గొచ్చు అంటూ క్వాంట్ మ్యూచువల్ ఫండ్ అంచనా వేసింది. ప్రస్తుతం జూన్ 7న తులం బంగారం పై స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. కేవలం పది రూపాయలు మాత్రమే తగ్గి దేశీయంగా తులం బంగారం ధర రూ.99,590 వద్ద ఉంది. అయితే బంగారం ధర కొనుగోలు చేస్తే మాత్రం తులంపై లక్ష రూపాయలు దాటుతుంది.



ఎందుకంటే అందులో జీఎస్టీ, ఇతర ఛార్జీలు ఉంటాయి.

–హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.99,590 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.91,290 వద్ద కొనసాగుతోంది.


–ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.99,740 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.91,140 వద్ద కొనసాగుతోంది.

–ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.99,590 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.91,290 వద్ద కొనసాగుతోంది.

–చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.99,590 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.91,290 వద్ద కొనసాగుతోంది.

## త్వరలో రూ.500 నోట్ల రద్దు..?

### ప్రభుత్వం ఏం చెప్పిందంటే..?



**తెలంగాణవీణ, బిజినెస్**

కేంద్ర ప్రభుత్వం ఇటీవలే రూ.2 వేల నోట్లను రద్దు చేసిన విషయం తెలిసిందే. రూ.2వేల నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు 19 మే 2023న ఆర్‌బీఐ ప్రకటించింది. అయితే, త్వరలో దేశంలో రూ.500 నోట్లను కూడా ప్రభుత్వం రద్దు (Discontinued) చేయనుందంటూ ఓ వార్త తెగ వైరల్ అవుతోంది. 2026 మార్చి నాటికి రూ.500 నోట్లను ఆర్‌బీఐ చెలామణి నుంచి ఉపసంహరించుకుంటుందంటూ విస్తృతంగా ప్రచారం జరుగుతోంది.కాపిటల్ టీవీ' అనే యూట్యూబ్ ఛానల్ దీనిపై వీడియో సైతం రిలీజ్ చేసింది. 2026 మార్చి నాటికి రూ.500 నోట్లు చాలామణీలో లేకుండా పోతాయని పేర్కొంది. 12 నిమిషాల నిడివిగల ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. ఈ ప్రచారంపై ప్రభుత్వానికి చెందిన పీఐబీ ఫ్యాక్ట్ చెక్ (PIB Fact Check) తాజాగా స్పందించింది. 'ప్రభుత్వం 500 రూపాయల నోట్లను ఉపసంహరించుకోవటం లేదు. అవి చలామణీలోనే ఉంటాయి. ఈ నోట్లు దేశవ్యాప్తంగా చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతాయి. వాటి జారీ, స్వీకరణ యథావిధిగా కొనసాగుతుంది' అని ది ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో స్పష్టం చేసింది. ఇలాంటి తప్పుడు వార్తలను నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించింది.

# గ్రాండ్ విటారాపై ప్రత్యేక స్కీం

**తెలంగాణవీణ, బిజినెస్ న్యూఢిల్లీ,**

కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకీ కీలక నిర్ణయం తీసుకున్నది. పాత మాడల్ నుంచి కొత్త మాడల్‌కు అప్‌గ్రేడ్ అయ్యే కస్టమర్లను ఆకట్టుకోవడానికి ప్రత్యే ఫైనాన్స్ స్కీంను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ స్కీంతో మధ్యస్థాయి ఎస్‌యూవీ గ్రాండ్ విటారాకు అప్‌గ్రేడ్ అయ్యేవారికి రూ.9,999 ఈఎంఐతో రుణాలు మంజూరు చేస్తున్నది.ప్రస్తుతం స్టాండర్డ్ ఫైనాన్స్ స్కీంల కంటే 20 శాతం తక్కువకే ఈఎంఐని అందిస్తున్నట్టు మారుతి సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి పార్థో బెనర్జీ తెలిపారు. ఐదేండ్లు లేదా 75 వేల కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత ఈ కారును తిరిగి ఇచ్చే అవకాశం కొనుగోలుదారుడికి కల్పించింది. ఈ కారు రిటర్నులో వాహన ధరలో 50 శాతం తిరిగి చెల్లించనున్నది.




# స్పోర్ట్స్

# ఇంగ్లండ్ సిరీస్ చేజారితే.. కోహ్లి వీడ్కోలు నిర్ణయం వెనక్కి..!

**తెలంగాణవీణ, క్రీడలు :**

సుదీర్ఘ ఫార్మాట్‌పై చెరగని ముద్ర వేసిన క్రికెటర్ విరాట్ కోహ్లి . ప్రత్యర్థి ఆటగాళ్ల 'స్లెడ్జింగ్'కు వాళ్ల భాషలో బదులిస్తూ.. ప్రేక్షకులను తన హావభావాలతో అలరిస్తూ ఉండే విరాట్ లేని భారత టెస్టు జట్టును ఊహించడం కొంచెం కష్టమే. ఇంగ్లండ్ పర్యటన కు ముందే రిటైర్మెంట్ బాంబ్ పేల్చిన కోహ్లి.. ఓ రకంగా ప్రత్యర్థి మానసిక స్థయిర్యాన్ని పెంచిందనే చెప్పాలి. ఒకవేళ ఐదు టెస్టుల సిరీస్‌లో టీమిండియా ఓడిపోతే కోహ్లి కచ్చితంగా యూటర్న్ తీసుకుంటాడని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైఖేల్ క్లార్క్ అంటున్నాడు.ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ తొలి సైకిల్‌లో భారత జట్టు తొలి సమరానికి సిద్ధమైంది. దశాబ్దకాలంగా టీమిండియా విజయాల్లో కీలక పాత్ర పోషించిన విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, అశ్విన్‌లు లేకుండానే ఇంగ్లండ్‌తో గిల్ సేన తలపడనుంది. ఇప్పటికే సిరీస్ కోసం భారత బృందం ఇంగ్లండ్ గడ్డపై అడుగుపెట్టింది. సీనియర్ల గైర్హాజరీలో గిల్ సేన ప్రదర్శన ఎలా ఉంటుంది? అనేదానిపై తలోకరకంగా చర్చించుకుంటున్నారు. ఇదే విషయమై ఆసీస్ మాజీ సారథి, ప్రస్తుతం కామెంటేటర్‌గా అవతారమెత్తిన క్లార్క్ తన అభిప్రాయాన్ని పంచుకున్నాడు.సీనియర్లు వీడ్కోలు పలికిన నేపథ్యంలో ఇంగ్లండ్ గడ్డపై విజయం సాధించడం భారత్‌కు కష్టమే. ఒకవేళ ఆతిథ్య జట్టు చేతిలో టీమిండియా 5–0తో వైట్‌వాష్‌కు గురైందనుకోండి.. అప్పుడు అభిమానులు కోహ్లి మళ్లీ ఆడాలని ముక్తకంఠంతో నినదిస్తారు. అన్నివైపుల నుంచి కెప్టెన్, కోచ్‌లపై ఒత్తిడి వస్తుంది. ఈ సమయంలో కెప్టెన్ , సెలెక్టర్లు కోహ్లిని సంప్రదించే అవకాశముంది. ఫ్యాన్స్ మద్దతు కూడా ఉందనుకోండి.. విరాట్ యూటర్న్ తీసుకునే అవకాశముంది. ఎందుకంటే.. అతడు ఇప్పటికీ టెస్టు క్రికెట్‌ను ఇష్టపడుతున్నాడు. ఇంకో రెండు మూడేళ్లు సుదీర్ఘ ఫార్మాట్ ఆడగల సత్తా అతడికి ఉందన్న విషయం మనందరికి తెలిసిందే. ఇప్పటికైతే విరాట్ స్థానాన్ని సాయి సుదర్శన్ తో భర్తీ చేయడం మంచిది. ఐపీఎల్‌లో దంచేసిన ఈ కుర్రాడు సాంకేతికంగా ఆరితేరినవాడు. ఎలాంటిపరిస్థితులనైనా ఎదుర్కోగల మానసిక సన్నద్ధత సుదర్శన్‌కు ఉంది. సో.. మూడో స్థానంలో నా ఛాయిస్ అతడే' అని క్లార్క్ వెల్లడించాడు.




## కొత్త నాయకుడికి తొలి సవాల్..

### ఇంగ్లండ్ చేరుకున్న భారత జట్టు



**తెలంగాణవీణ, క్రీడలు :**

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ కొత్త సైకిల్(2025–27) తొలి సిరీస్ కోసం భారత జట్టు ఇంగ్లండ్ చేరుకుంది. శుక్రవారం రాత్రి మీడియా సమావేశం అనంతరం హెడ్‌కోచ్ గంభీర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తో పాటు టీమిండియా బృందం ముంబైలో లండన్ విమానం ఎక్కింది. సుదీర్ఘ ప్రయాణం అనంతరం శనివారం భారత ఆటగాళ్లు ఇంగ్లండ్‌లో అడుగుపెట్టారు. 5 టెస్టుల సిరీస్ కోసం భారత బృందం ఇంగ్లండ్‌లో కాలు మోపింది అంటూ బీసీసీఐ ఎక్స్ ఖాతాలో వీడియో పోస్ట్ చేసింది.దేశవాళీ, ఐపీఎల్‌లో నిలకడగా రాణించిన సాయి సుదర్శన్ ఇంగ్లండ్ గడ్డపై టెస్టుల్లో అరంగేట్రం చేయనున్నాడు. ఇంగ్లండ్ పిచ్‌లపై కూడా చెలరేగి ఆడాలనుకుంటున్న ఈ చిచ్చరపిడుగు సిరీస్ కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నట్టు చెప్పాడు. భారత జట్టులో అది కూడా టెస్టు ఆటగాడిగా ఎంపిక కావడం నిజంగా చాలా గొప్ప విషయం. లండన్‌లోకి స్వాగతం పలుకుతున్నా సుదర్శన్ బీసీసీఐ పోస్ట్ చేసిన వీడియోలో అన్నాడీ యువకెరటం.సీనియర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, అశ్విన్‌ల గైర్హాజరీలో తొలిసారి భారత జట్టు విదేశీ పర్యటనకు వెళ్లింది. ఇక కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్‌కు ఇదే మొదటి సిరీస్. సో.. నాయకుడిగా తనను తాను నిరూపించుకునేందుకు అతడికి ఇదొక అవకాశం. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌ను ప్లే ఆఫ్స్ తీసుకుకెళ్లిన ఈ యంగ్ కెప్టెన్.. ఇప్పుడు కోట్లాది మంది ఆశల్ని మోస్తూ ఇంగ్లండ్‌లో 'శభాష్ గిల్' అనిపించుకోవాలనే ఆలోచనతో ఉన్నాడు. అతడికి అన్నివిధాలా అండగా కోచ్ గంభీర్ ఉండనే ఉన్నాడు. వీళ్ల కాంబినేషన్‌లో భారత జట్టు సిరీస్ కైవసం చేసుకుంటుందా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది. డబ్ల్యూటీసీ సైకిల్‌లో ఇంగ్లండ్, భారత జట్లకు ఇదే మొట్ట మొదటి సిరీస్. జూన్ 20 లీడ్స్ వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. కాబట్టి.. ఇరు టీమ్‌లు విజయం కోసం గట్టిగానే పోరాడనున్నాయి. బర్మింగ్‌హామ్‌లో జూలై 2న రెండో మ్యాచ్, లార్డ్స్‌లో జూలై 10న మూడో టెస్టు, మాంచెస్టర్‌లో జూలై 23 నాలుగో మ్యాచ్, ఓవల్‌లో ఆగస్ట్ 4న ఐదో టెస్టులో భారత్, ఇంగ్లండ్ తలపడనున్నాయి.

# ఆ ముద్రను చెరిపేస్తాం..

## మా చేతిలో ఆస్ట్రేలియాకు భంగపాటు తప్పదు..!

**తెలంగాణవీణ, క్రీడలు :**

ఏప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ కు మరో నాలుగు రోజులే ఉంది. డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియా మరోసారి టెస్టు గదపై కన్నేయగా.. 'ఐసీసీ ఛాంపియన్' అనిపించుకోవాలని దక్షిణాఫ్రికా కంకణం కట్టుకుంది. కాబట్టి.. ఇరుజట్ల మధ్య జూన్ 11న డబ్ల్యూటీసీ ఫైనల్ హోరాహోరీగా జరగడం ఖాయం అనిపిస్తోంది. ఈ నేపథ్యంలో మాజీ క్రికెటర్ ఏబీ డివిలియర్స్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఈసారి సఫారీల చేతిలో ఆసీస్‌కు భంగపాటు తప్పదని అతడు పేర్కొన్నాడు. లార్డ్స్ మైదానంలో జూన్ 11న డబ్ల్యూటీసీ ఫైనల్ జరుగనుంది. ఐసీసీ టైటిల్ కోసం ఏళ్లుగా నిరీక్షిస్తున్న దక్షిణాఫ్రికాకు ఈ మ్యాచ్ చాలా కీలకం. 'యావత్ దేశమంతా మా జట్టుకు మద్దతుగా ఉంది. ఐసీసీ ఫైనల్స్‌లో ఓడిపోతుండడంతో చోకర్స్‌గా తమపై పడిన ముద్రను చెరిపివేసుకునే సమయం వచ్చేసింది. ఇరుజట్ల మధ్య ఫైనల్ పోరు కోసం నేను ఆతృతగా ఉన్నాను. అన్నివిభాగాల్లో మా జట్టు సమతూకంగా ఉంది. చెప్పాలంటే ఆసీస్‌కు సమఉజ్జీలా. నాకు ఎందుకనో.. ఈసారి మా చేతిలో ఆస్ట్రేలియాకు భంగపాటు తప్పదని అనిపిస్తోంది .ఎందుకిలా చెబుతున్నానంటే డబ్ల్యూటీసీ ఫైనల్లో అస్ట్రేలియా కచ్చితంగా ఫేవరెట్ జట్టు. అందులోని చాలామంది ఆటగాళ్లకు మెగా టోర్నీ ఫైనల్స్ ఆడిన అనుభవం ఉంది. పైగా వాళ్ల కూర్పు కూడా బాగుంది. సో.. కంగారూలను ఓడించి టెస్టు గదను ముద్దాడడం సఫారీలకు అంత సులువేమీ కాదు. కానీ, విశ్వ వేదికపై మా సత్తా చాటాల్సిన సమయం వచ్చేసింది. జట్టులోని క్రికెటర్లంతా సమిష్టిగా ఆడితే మా ఐసీసీ ట్రోఫీ కల సాకారమైనట్టే' అని డివిలియర్స్ వెల్లడించాడు.







# ఉత్కంఠగా ఆది సాయికుమార్ 'శంబాల' టీజర్

తెలంగాణవీణ, సినిమా :
టాలీవుడ్ యువ కథానాయకుడు ఆది సాయికుమార్ నటిస్తున్న తాజా చిత్రం 'శంబాల.. ఏ మిస్టిక్ వరల్డ్' యుగంధర్ ముని దర్శకత్వం వహిస్తున్న ఈ సూపర్ నాచురల్ హారర్ థ్రిల్లర్‌లో అర్చన అయ్యర్, స్వాసిక్ హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రంపై అంచనాలు భారీగా ఉన్నాయి. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమా నుంచి టీజర్‌ను తాజాగా విడుదల చేసింది చిత్రయూనిట్.ఈ విశ్వంలో అంతుపట్టని రహస్యాలు ఎన్నో ఉన్నాయి. సైన్స్‌కు సమాధానం దొరకనప్పుడు వాటిని మూఢనమ్మకం అంటుంది. అదే సమాధానం దొరికితే అదే తన గొప్పతనం అంటుంది అనే డైలాగ్‌తో ఈ టీజర్ స్టార్ట్ అవుతుంది. అనంతరం ఆకాశం నుంచి ఒక ఉల్క లాంటి రాయి కిందికి వచ్చి ఒక ఊరిలో పడుతుంది. అయితే అది పడిన తర్వాత నుంచి ఆ ఊరిలో ప్రజలు వింతగా ప్రవర్తిస్తుంటారు. అయితే దాని వెనుక ఉన్న రహస్యం ఏంటీ అనేది తెలియాలంటే ఈ సినిమా చూడాల్సిందే. ఆది సాయికుమార్ ఈ చిత్రంలో భౌగోళిక శాస్త్రవేత్తగా ఓ ఛాలెంజింగ్ పాత్రలో కనిపించనున్నారు.



# అక్కడ టాటూను తొలగించిన సమంత..

తెలంగాణవీణ, సినిమా :
స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం నిర్మాతగానూ సినిమాలు చేస్తుంది. హీరోయిన్ గా స్టార్ డమ్ అందుకుంది సామ్.. ఇప్పుడు నిర్మాతగా మారింది. ఇటీవలే శుభం అనే సినిమా చేసింది. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. తక్కువ సమయంలో స్టార్ హీరోయిన్‌గా మారిపోయిన సమంత.. టాలీవుడ్ లో దాదాపు అందరు స్టార్ హీరోలతో నటించారు. సమంత అందానికి, నటనకు ఫిదా కానీ కుర్రాడు ఉండడు. సమంత తెలుగుతో పాటు తమిళ్, హిందీలోనూ నటిస్తూ మెప్పిస్తుంది. సిటాడెల్ అనే సిరీస్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సామ్ గతంలో ఫ్యామిలీ మ్యాన్ 2 వెబ్ సిరీస్ లో నటించి మెప్పించింది. ఈ సిరీస్ తో హిందీ ఆడియన్స్ కు దగ్గరయిన సామ్ ఇప్పుడు. సిటాడెల్ సిరీస్ తో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ప్రస్తుతం ఈ సిరీస్ ఓటీటీలోఅదరగొడుతోంది. నెట్ ఫ్లిక్స్ లో ట్రెండింగ్‌లో ఉంది ఈ సిరీస్.త్వరలోనే సమంత హీరోయిన్ గా ను బిజీ కానుంది. ఇదిలా ఉంటే తాజాగా సమంతకు సంబందించిన ఓ వీడియో వైరల్ అవుతుంది. ఈ వీడియోలో సమంత మెడ పై టాటూ కనిపించకపోవడంతో నెటిజన్స్ షాక్ అవుతున్నారు. సమంత టాటూ కనిపించకపోవడంతో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. సమంత టాటూ తొలగించిందని కొంతమంది. లేదు మేకప్ తో కవర్ చేసిందని మరికొంతమంది అంటున్నారు.సమంత మెడపై వైఎమ్‌సి అనే టాటూ ఉంటుంది. తన మొదటి సినిమా ఏమాయ చేసావె గుర్తుగా ఆ టాటూ వేయించుకుంది సమంత. గౌతమ్ మీనన్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో నాగ చైతన్య హీరోగా నటించాడు. అయితే ఈ వైఎమ్‌సి టాటూ గురించి పలు ఇంటర్వ్యూల్లోనూ చెప్పింది సమంత. ఇప్పుడు టాటూ కనిపించక పోవడంతో నెటిజన్స్ రకరకాలుగా స్పందిస్తున్నారు. ఇక సామ్ సినిమాల విషయానికొస్తే.. బాలీవుడ్ లో రక్త్ బ్రహ్మాండ్ అనే సిరీస్ లో నటిస్తుంది. ఈ సిరీస్ కు రాజ్ డీకే దర్శకత్వం వహిస్తున్నారు. అలాగే మా ఇంటి బంగారం అనే సినిమాలోనూ నటిస్తున్నారు సామ్.



# ఆయన వల్లే నాకు ఆ అదృష్టం

తెలంగాణవీణ, సినిమా :
కమల్‌హాసన్ నటించిన థగ్ లైఫ్‌లో విన్ వెలి నాయకా అంటూ పాట పాడారు శ్రుతి హాసన్. థగ్ లైఫ్ ప్రీ రిలీజ్ ఈవెంట్లోనూ ఆ పాటను స్టేజ్ మీద పెర్ఫార్మ్ చేశారు. అప్పటి నుంచి ఇంకా ఇంకా మెసేజ్‌ల వెల్లువ ఆగడం లేదంటున్నారు శ్రుతి.తండ్రికి సంగీతం చేసే అదృష్టం, తండ్రి సినిమాకు పాట పాడే అదృష్టం ఎంత మంది కూతుళ్లకు దక్కిందో నాకు తెలియదు కానీ, నేను మాత్రం జీవిత సాఫల్యంగా భావిస్తున్నానని చెప్పారు శ్రుతిహాసన్.ఈనాడు సినిమాకు మ్యూజిక్ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. ఇన్నేళ్ల తర్వాత మా నాన్న కోసం నేను పనిచేయడం ఆనందంగా ఉంది. రీసెంట్‌గా ఇనిమేల్ వీడియో ఆల్బమ్ కోసం నాన్నతో పనిచేశాను.మళ్లీ ఇప్పుడు సినిమాకోసం వర్క్ చేశాను. నేనంటే గిట్టని వాళ్లు కూడా నా పెర్ఫార్మెన్స్ కి ఫిదా అయి మెసేజ్‌లు చేస్తున్నారని చెప్పారు శ్రుతి. కమల్‌హాసన్‌తో పనిచేసిన థగ్‌లైఫ్‌ఈ ఏడాదే విడుదలైంది.రజనీకాంత్‌తో వర్క్ చేసిన కూలీ కూడా ఈ ఏడాదే ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ఒకే ఏడాది ఇద్దరు లెజండరీ నటులతో అసోసియేట్ అయ్యే అరుదైన అవకాశం కూడా తనకు దక్కిందంటున్నారు శ్రుతి.





# కన్నప్పకి కష్టాలు..

## అడ్డుకుంటామంటూ బ్రాహ్మణ సంఘాలు వార్నింగ్

తెలంగాణవీణ, సినిమా :
మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్పకి అడుగడుగునా అవాంతరాలు ఎదురవుతూనే ఉన్నాయి. కన్నప్ప చిత్రం జూన్ 27న విడుదల కానుండగా, ఈ సినిమాని అడ్డుకుంటామంటూ తాజాగా బ్రాహ్మణ సంఘాలు పిలుపునిచ్చాయి. కన్నప్ప సినిమాలో పిలక గిలక పాత్రపై బ్రాహ్మణ సంఘాలు మండిపడుతున్నాయి. గుంటూరులో (శనివారం) కన్నప్ప సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించరు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని అడ్డుకుంటామని బ్రాహ్మణ సంఘాలు హెచ్చరిస్తున్నాయి.. ఈ మేరకు బ్రాహ్మణ చైతన్య వేదిక అధ్యక్షుడు శ్రీధర్ ఓ ప్రకటన కూడా విడుదల చేశారు.మంచు మోహన్ బాబు కుటుంబానికి బ్రాహ్మణులని అవమానించడం అలవాటేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలోనూ చాలా సినిమాల్లో బ్రాహ్మణులను కించపరిచిన వారు కన్నప్ప సినిమాలో పిలక గిలక పాత్ర పెట్టారు. ఈ పాత్రపై ఈ రోజు జరిగే ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో స్పష్టత ఇవ్వకపోతే కోర్టును ఆశ్రయించి సినిమాని అడ్డుకుంటామంటూ హెచ్చరించారు. బ్రాహ్మణులను కించపరిచే విధంగా పాత్రలతో సినిమాలు నిర్మించడం ఇప్పటికైనా మంచు మోహన్‌బాబు కుటుంబం మానుకోవాలంటూ శ్రీధర్ ధ్వజమెత్తారు. దీనిపై చిత్ర యూనిట్ వారు ఆలోచన చేయాలని అన్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో కన్నప్ప నుండి పిలక గిలక అనే హాస్య పాత్రలని పరిచయం చేశారు. ఇందులో బ్రహ్మానందం, సప్తగిరి ఉన్నారు. పోస్టర్‌లో చేపకు ఈత, పులికి వేట, కోకిలకి పాట నేర్పిన గురువులు.. అడవికే పాఠాలు చెప్పడానికి వస్తే.. అనే డైలాగ్ కూడా రివీల్ చేశారు. ఇప్పుడు ఇవే తమ మనోభావాలని కించపరుస్తున్నాయంటూ బ్రాహ్మణ సంఘాలు మండిపడుతున్నాయి.

Published and printed by ulloju Srinivas on behlf of Veena publications printed at telangana Veena plot no.204 Maitri apartments.opp BSNL office ECIL kapra,med responsible for selection of news under the prb act, phone number 040 35668720 rni reg no.teltel/2280 reproduction in whole or in part without written